

రాజమహేంద్రవరం సాంస్కృతికం: రాజమహేంద్రవరంలోని కోరుకొండ రోడ్డు శ్రీసాయి కనకదుర్గ ఆలయం నుంచి 300 మంది మహిళలు సోమవారం కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. సనాతన ధర్మ పరిరక్షణకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన దీక్షకు మద్దతుగా ఈ ఊరేగింపు నిర్వహించామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీనివాస్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

రేపు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

కాపవరం రానున్న మంత్రి మనోహర్

బాగల్లు, కొవ్వూరు పట్టణం: రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ నెల 9న కొవ్వూరు మండలం కాపవరం వస్తున్నారు. అక్కడి రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సాయంత్రం 4 గంటలకు ఆయన ప్రారంభిస్తారని ఆ శాఖ జిల్లా మేనేజర్ టి.రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి, జేసీ ఎస్.చిన్నరాముడు, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొంటారన్నారు.

ఈనాడు తూర్పుగోదావరి

మంగళవారం అక్టోబరు 8, 2024

ఉమ్మడి జిల్లా మీదుగా సాగే ప్రైవేటు బస్సులు	ఆలిండియా పర్మిట్ ట్రావెల్స్ 61	దూర ప్రాంతాలవి 30	ఇతర ప్రాంత సర్వీసులు 80


ఉమ్మడి తూర్పులో ఇలా..	ఆర్టీసీ డిపోలు 11	బస్ స్టేషన్లు 44	బస్సుల సంఖ్య 901	పండగ వేళ రద్దీ సుమారు 10 లక్షలు

పండగ వేళ.. వీరబాదుడు

ఆర్టీసీలో సాధారణం.. ప్రైవేటులో అధిక భారం

ఈనాడు, కాకినాడ

రాజమహేంద్రవరం నుంచి వివిధ ప్రాంతాలకు ఛార్జీలిలా..



దసరా సెలవుల వేళ స్వస్థలాల్లో పండగ చేసుకోవడానికి రాకపోకలు ఊపందుకున్నాయి. ఓ ప్రణాళిక ప్రకారం ముందుగానే రిజర్వేషన్లు చేసుకొన్నవారు కొందరైతే.. ఇంకొందరు అప్పటికప్పుడు సిద్ధమవుతున్నారు. ఆర్టీసీ సాధారణ ఛార్జీలే వసూలు చేస్తుండగా ప్రైవేటు బస్సుల్లో బాదుడు తప్పడంలేదు. డిమాండ్ ఆధారంగా ధరలు పెంచేస్తున్నారు. పండగ అటు ఇటు రోజుల పరిస్థితి చూస్తే టికెట్టా.. రాకెట్టా.. ? అన్నంతగా ఉంది.



కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల నుంచి దూర ప్రాంతాలకు పండగ వేళల్లో లక్షల మంది వెళ్తారు. ఉపాధి, ఉద్యోగరీత్యా ఇతర జిల్లాలు, రాష్ట్రాలు, దేశాల్లో ఉన్నవారు సైతం ఇక్కడికి పెద్ద ఎత్తున వస్తుంటారు. కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురం, రావులపాలెం, తుని, పెద్దాపురం, పిఠాపురం, సామర్లకోట, యానాం నుంచి ప్రైవేటు బస్సులు దూరప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, తిరుపతి, విజయవాడ, విశాఖ, శ్రీకాకుళం ప్రాంతాలకు ప్రైవేటు ట్రావెల్స్ సేవలు ఉన్నాయి. తాకిడి ఆధారంగా ధరలు పెంచేస్తున్నారు.

నిఘా ఎక్కడుంది?

■ ఉమ్మడి జిల్లాలో రవాణాశాఖ చెక్‌పోస్టు గతంలో తుని మండలం తేటగుంట వద్ద ఉండేది.. వైకాపా వచ్చాక బెండపూడి ప్రాంతానికి మార్చారు. ఎన్నికలకు ముందు దీంతోపాటు రాష్ట్రంలోని 18 చెక్‌పోస్టులూ ఎత్తేశారు. వాహనాలపై నిఘా ఉంచామని అధికారులు చెబుతున్నా.. ప్రత్యేక డ్రైవ్‌లు, తనిఖీలు లేవు. ఈ పరిస్థితుల్లో ఫిట్‌నెస్ లేని బస్సులు రోడ్లపైకి వచ్చే ప్రమాదమూ ఉంది. పండగ రోజుల్లో అధిక ఛార్జీల వసూళ్లతోపాటు.. ప్రయాణికుల భద్రతపైనా దృష్టిసారించడం మేలు.

అతిక్రమిస్తే చర్యలు



సాధారణ రోజులతో పాటు.. పండగ సీజన్ లోనూ వాహనాలు తనిఖీ చేస్తున్నాం. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు పెడతాం. ఉమ్మడి జిల్లాలోని చెక్‌పోస్టు ఎత్తివేసినా.. కీలక మార్గాల్లో నిఘా ఉంది. ఆన్‌లైన్‌లో, క్షేత్రస్థాయిలో పరిశీలించి అధిక ఛార్జీలు వసూలు చేయకుండా చర్యలు తీసుకుంటాం.

- కె.శ్రీధర్, ఉప కమిషనర్, రవాణాశాఖ, కాకినాడ జిల్లా

సత్యదేవుని ప్రసాదానికి విజయ నెయ్యి

అన్నవరం: అన్నవరం సత్యదేవుని గోధుమ నూక ప్రసాదం తయారీకి విజయవాడలోని విజయ డెయిరీ నెయ్యి వినియోగించనున్నారు. ఆలయాల్లో వినియోగించే నెయ్యి నాణ్యతపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇంతవరకు సరఫరా చేసే గుత్తేదారు గడువు సెప్టెంబరు 30తో ముగియడంతో కొత్తవారికి ఇంకా అనుమతి ఇవ్వలేదు. దేవాదాయ శాఖ మార్గదర్శకాలు వచ్చే వరకు తాత్కాలికంగా విజయ నెయ్యి తీసుకుంటారు. ముందుగా 300 డబ్బాల నెయ్యి (4,500 కేజీలు) అన్నవరానికి వచ్చింది. మరో 150 డబ్బాలు మంగళవారం రానున్నాయని తెలిసింది. దేవాదాయశాఖ నుంచి మార్గదర్శకాలు వచ్చిన తర్వాత పూర్తిస్థాయిలో ఎక్కడినుంచి కొనుగోలు చేయాలో తుది నిర్ణయం తీసుకుంటారు.

తెలుగు వికాసానికి అడుగులు

- చారిత్రక నగరిలో విశ్వవిద్యాలయం • త్వరలో నిర్ణయం వచ్చే అవకాశం



తెలుగుసాహిత్య పీఠం ప్రధాన ద్వారం

ఈనాడు, రాజమహేంద్రవరం: విద్యారంగం పరంగా రాజమహేంద్రవరం మరో మైలురాయి చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. తెలుగు విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కార్యాచరణ సిద్ధమవుతోంది. హైదరాబాద్ కేంద్రంగా పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉన్న విషయం తెలిసిందే. దీనికి అనుబంధంగా రాజమహేంద్రవరం, శ్రీశైలం, కూచిపూడిలో పీఠాలున్నాయి. విభజన చట్టం మేరకు పదేళ్ల గడువు పూర్తయ్యేలోగా వైకాపా సర్కారు పట్టించుకోలేదు. తెలంగాణ ప్రభుత్వం ఈ ఏడాది ప్రవేశాలకు అనుమతించకపోవడంతో ప్రత్యామ్నాయ చర్యలపై ఉన్నత విద్యాశాఖ దృష్టిసారించింది. రాజమహేంద్రవరం కేంద్రంగా విశ్వవిద్యాలయం ఏర్పాటుచేసి ఇతర పీఠాలను అనుసంధానం చేసే అంశాన్ని యోచిస్తోంది. నెలరోజుల్లో స్పష్టత రానుంది.

● 220 మంది విద్యార్థులు

రాజమహేంద్రవరం, కూచిపూడి, శ్రీశైలంలోని పీఠాల్లో సుమారు 220 మంది విద్యార్థులున్నారు. కొత్తగా చేరాలనుకున్నవారికి ఒక విద్యా సంవత్సరం వృథా అయ్యే అవకాశం ఉంది.

● ఇక్కడే ఎందుకంటే

రాజమహేంద్రవరం గ్రామీణం బొమ్మూరులోని 40 ఎకరాల్లో 48 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో తెలుగు సాహితీపీఠం, భవనాలు ఉన్నాయి. నిర్వహణకు 72 మంది బోధన, 115 మంది బోధనేతర సిబ్బంది అవసరం. హైదరాబాద్‌లో పనిచేస్తున్నవారిలో 112 మంది బోధనా, బోధనేతర సిబ్బంది రాష్ట్రానికి చెందినవారే కావడంతో వారిని బదిలీ చేస్తే సమస్య పరిష్కారమవుతుందని భావిస్తున్నారు. ఎంపీ పురందేశ్వరి, మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ దిశగా కృషిచేయాలన్న ఆకాంక్ష వ్యక్తమవుతోంది .

● ఈ కోర్సులు అందుబాటులోకి..

తెలుగు విశ్వవిద్యాలయంలో తెలుగు భాష, సంస్కృతి, సాహిత్యం, చరిత్ర, భాషా సాహిత్యం, తులనాత్మక సాహిత్యం, జ్యోతిషం, జర్నలిజం, లలిత సంగీతం, కర్ణాటక సంగీతం, కూచిపూడి నృత్యం, శిల్పం, చిత్రలేఖనం తదితర 17 విభాగాల్లో ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ, తదితర డిప్లొమో కోర్సులు ఉన్నాయి. ఇవన్నీ స్థానికంగా రాష్ట్ర విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావొచ్చు. ● చరిత్ర, పురావస్తుశాస్త్రానికి సంబంధించి శ్రీశైలంలోని పీఠంలో ఎంఏ, పీహెచ్‌డీ కోర్సులున్నాయి. ● కూచిపూడి పీఠంలో కూచిపూడి నాట్యంలో ఎంఏ, సర్టిఫికేట్, డిప్లొమో కోర్సులు ఉన్నాయి. ఇవన్నీ యథవిధిగా కొనసాగించవచ్చు.

ఉన్నత విద్యాశాఖ దృష్టికి..

తెలుగు విశ్వవిద్యాలయంలో విద్యార్థుల ప్రవేశాలకు ఇప్పటి వరకు తెలంగాణ ప్రభుత్వం అనుమతివ్వలేదు. రాజమహేంద్రవరంలో వర్సిటీ ఏర్పాటుకు ఉన్న అవకాశాలను ఉన్నత విద్యాశాఖ అధికారులకు విన్నవించాం. ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం వస్తుందని భావిస్తున్నాం.

-నిరీక్షణబాబు, ప్రొఫెసర్, ఓఎస్‌డీ, తెలుగు సాహిత్య పీఠం

భూ సమస్యకు పరిష్కారం

మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఫ్లెక్సీ

ఈనాడు, కాకినాడ: వైకాపా ప్రభుత్వంలో అన్యాక్రాంతమైన భూమి.. కూటమి ప్రభుత్వం వచ్చాక తిరిగి దక్కడంతో కాకినాడకు చెందిన వ్యాపారి చలికి వీరేంద్ర ఆనందం వ్యక్తంచేశారు. తెదేపా యువనేత, మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ భారీ ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. 'లోకేశ్ గారి ప్రజాదర్బార్‌లో నా భూమి సమస్య పరిష్కారమైంది.. కృతజ్ఞతలు తెలుపుతున్నాను' అంటూ ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ పలువురిని ఆకర్షిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో కాకినాడ కలెక్టరేట్‌లో భూ దస్త్రాలు దిద్దేసి.. వీరేంద్రకు చెందిన చీడీలపొర ప్రాంతంలోని ఎకరం భూమిని ఆక్రమించడం సంచలనం కలిగించింది. దీంతో లోకేశ్‌కు యువగళం పాదయాత్రలోను, ప్రభుత్వం వచ్చాక ప్రజా దర్బార్‌లోనూ సమస్య విన్నవించారు. సానుకూల స్పందన రావడంతో.. ఆక్రమిత భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్న వీరేంద్ర.. ఆ స్థలంలో ఇలా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు.



కాకినాడ చీడీలపొరలోని భూమి వద్ద ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ

స్పేస్ సైన్స్ నమూనా ప్రదర్శనలో ద్వితీయ బహుమతి



బహుమతి అందుకుంటున్న తపస్విరెడ్డి

నిడదవోలు: ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలను పురస్కరించుకుని ఇస్రో ఆధ్వర్యంలో భీమవరం విష్ణు కళాశాలలో నిర్వహించిన స్పేస్ సైన్స్ మోడల్ ఎగ్జిబిషన్‌లో నిడదవోలుకు చెందిన కుంచాల తపస్విరెడ్డి ద్వితీయ, స్పేస్ క్విజ్‌లో తృతీయ బహుమతులు సాధించాడు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, ఇస్రో చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.ప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నాడు. ఈ సందర్భంగా తపస్విరెడ్డిని పలువురు అభినందించారు.



అన్నదాతకు అండగా నిలిచేందుకు విభిన్న కథనాల సమాహారం

-6లో



భవన శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల

కూటమితో పల్లెల్లో ప్రగతికి బాటలు

కడియం: కూటమి ప్రభుత్వంతో పల్లెల్లో ప్రగతికి బాటలు పడుతున్నాయని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేశ్, గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. కడియం మండలం దామిరెడ్డిపల్లిలో రూ.40 లక్షల నిధులతో నిర్మించే మల్టీపర్పస్ భవనానికి మండల జనసేన పార్టీ అధ్యక్షుడు ముద్రగడ జెమీ ఆధ్వర్యంలో సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గత పాలకులు రాష్ట్రంలోని వనరులను దోచుకుని అభివృద్ధిని గాలికొదిలేశారన్నారు. ప్రస్తుతం సీఎం చంద్రబాబు దార్శనికతతో పాటు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా స్వర్ణాంధ్ర నిర్మాణానికి కంకణబద్ధులై పనిచేస్తున్నారని వివరించారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ఇంటింటా తాగునీటి కొళాయి ఏర్పాటు చేస్తామన్నారు. పల్లెలో మౌలిక వసతుల రూపకల్పనకు తమ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే గోరంట్ల వివరించారు .కార్యక్రమంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, సర్పంచి ముద్రగడ సత్యస్వరూప తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే నల్లమిల్లి ఫిర్యాదుపై విచారణ

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అనపర్తి మండలంలోని నాలుగు గ్రామాల్లో పంపిణీ చేసిన నివేశన స్థలాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేసిన ఫిర్యాదుపై సోమవారం అనపర్తిలో విచారణ చేపట్టారు. ఆర్డీ స్వామినాయుడు విచారణాధికారిగా హాజరై విచారించగా.. స్థానిక కూటమి నాయకులు ఆయన్ను కలసి కొన్ని ఫిర్యాదులు అందించారు. ఆగస్టు 27వ తేదీన ఎమ్మెల్యే.. ముఖ్యమంత్రికి నివేశన స్థలాల విషయమై లేఖ రాశారు. అందులో విచారణ జరిపించాలని కోరగా, అది ప్రస్తుతం జరిగింది. పులగుర్తలో 20 ఎకరాలు, పెదపర్తిలో 3.64 ఎకరాలు, కుతుకులూరులో 7.7 ఎకరాలు, రామవరంలో 11.33 ఎకరాలు గృహనిర్మాణ పథకంలో భాగంగా నివేశన స్థలాల కోసం మొత్తం 42.76 ఎకరాలను గత ప్రభుత్వం సేకరించిందని నల్లమిల్లి లేఖలో పేర్కొన్నారు. భూసేకరణ చట్ట ప్రకారం ఎలాంటి ప్రకటలు లేకుండానే సేకరించారని, లబ్ధిదారుల ఎంపికలోనూ అవకతవకలు జరిగాయని ప్రస్తావించారు.. ఇలా అనేక అంశాలను లేఖలో పేర్కొనగా.. దానిపై ప్రస్తుతం లోతుగా విచారణ చేస్తున్నారు.

భూ ఆక్రమణలు బయటకొస్తున్నాయ్..!

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం కలెక్టరేట్

వైకాపా ప్రభుత్వ హయాంలో సామాన్య ప్రజలు, రైతుల భూములకు రక్షణ లేకుండా పోయింది. భూ సర్వేలో లోపాల కారణంగా మరికొందరు భూములు తగ్గిపోయి గగ్గోలు పెట్టారు. బాధితులు అనేకసార్లు కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరిగినా గోడు విన్నవారే కరవు. ప్రభుత్వం మారిన తర్వాత తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసేందుకు కలెక్టరేట్‌కు తరలి వస్తున్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 141 అర్జీలు వచ్చాయి. వీటిలో గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ ఆక్రమణలు, భూ సమస్యలు, రీసర్వే లోపాలకు సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువ. వచ్చిన అర్జీల్లో రెవెన్యూ సంబంధిత సమస్యలపైనే అత్యధికంగా 58 ఉన్నాయి.



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

వేరే వ్యక్తులకు రాసేశారు..



తాతల నుంచి సంక్రమించిన వ్యవసాయ భూమిని గత ప్రభుత్వ హయాంలో వేరే వ్యక్తుల పేరున రిజిస్ట్రేషన్ చేసేశారు. నిడదవోలు పట్టణంలో సర్వే నంబరు 890/5లో నాకు 13 సెంట్ల భూమి ఉంది. రివిజనల్ సర్వే చేసి ఇక్కడి మొత్తం భూమికి సంబంధించిన 142/8 పాత సర్వే నంబరును 1978లో రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసి దానికి బదులుగా కొత్తగా 890/5 సర్వేనంబరు ఇచ్చింది. తర్వాత దేవాదాయ శాఖ కమిషనర్ ఆ సర్వే నంబరులోని మొత్తం భూమిని 22ఏ 1సి కింద బ్లాక్ లిస్టులో పెట్టారు. అందులోని నాకు చెందిన 13 సెంట్ల భూమిని 2022 జూన్‌లో అప్పటి నిడదవోలు సబ్‌రిజిస్ట్రర్ ఉద్దేశపూర్వకంగా పాత సర్వే నంబరుతో వేరే వ్యక్తుల పేరున రిజిస్ట్రేషన్ చేశారు. అప్పటి రిజిస్ట్రేషన్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది.

- చెరకు శ్రీను, సింగవరం

ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు



గోకవరం మండలం మల్లవరం గ్రామంలో సర్వేనంబరు 224, 225ల్లో మా తండ్రి చిన్నగుర్రయ్యకు 10 ఎకరాల 58 సెంట్లు అసైన్డ్ భూమి ఉండగా అది అన్యాక్రాంతమయ్యింది. తహసీల్దారు కార్యాలయానికి ఎన్నిసార్లు తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు. పట్టాదారు పాస్‌బుక్ ఇప్పించాలని విన్నవించినా ఇవ్వలేదు. ఉన్నతాధికారులు విచారణ జరిపి న్యాయం జరిగేలా చూడాలని కోరుతున్నా.

- ఎన్.అప్పారావు, మల్లిశాల

పంచాయతీ స్థలాన్ని కబ్జా చేశారు



పెరవలి మండలం కానూరులోని గ్రామపంచాయతీకి చెందిన 40 సెంట్ల స్థలం కబ్జాకు గురైంది. పంచాయతీ అధికారులు పట్టించుకోలేదు. దీనిపై గతేడాది స్పందనలో ఫిర్యాదు చేసినా అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. పంచాయతీ స్థలం కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టడంపై ప్రశ్నించినందుకు నాపై దౌర్జన్యం చేస్తున్నారు. స్థలం పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరుతూ అర్జీ అందించేందుకు వచ్చా.

- బి.శ్రీనివాసరావు, కానూరు

ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి: కలెక్టర్

ప్రజల సమస్యల విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టాలని, అర్జీలకు నిర్ణీత గడువులోగా శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. మీ స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని డివిజన్, మండలస్థాయి అధికారులను ప్రశ్నించారు. భూ ఆక్రమణలు, భూ సర్వే వంటి సమస్యలతోపాటు గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్తు సరఫరా సమస్యలపై ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.

టెట్‌కు 430 మంది హాజరు

శ్యామలా సెంటర్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగింది. రాజీవ్‌గాంధీ ఐయాన్ డిజిటల్ కేంద్రంలో ఉదయం జరిగిన పరీక్షకు 240 మందికి గాను 220 మంది, మధ్యాహ్నం పరీక్షకు 240 మందికి గాను 210 మంది హాజరయ్యారని డీఎస్ఈఓ కె.వాసుదేవరావు తెలిపారు.

డీఎస్‌వో బాధ్యతల స్వీకరణ



రాజమహేంద్రవరం కలెక్టర్: జిల్లా పౌరసరఫరాల అధికారి(డీఎస్‌వో)గా జె.వి.ఎస్.ఎం.ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలులో డీఎస్‌వోగా పనిచేసిన ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ముగియనున్న ఎన్ఎంఎంఎస్ గడువు

శ్యామలా సెంటర్: నేషనల్ మీన్స్ కం మెరిట్(ఎన్ఎంఎంఎస్) పరీక్షకు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తులను ఈనెల 15లోగా సమర్పించాలని డీఎస్ఈఓ కె.వాసుదేవరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను ఈనెల 17లోగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు.

మెనూ.. ఆస్వాదిస్తూ తినూ..

మధ్యాహ్న భోజనం మార్పునకు అభిప్రాయ సేకరణ

న్యూస్‌టుడే, శ్యామలా సెంటర్ (రాజమహేంద్రవరం)

మధ్యాహ్న భోజనం మొక్కుబడి తంతు కాకూడదు. పిల్లలు ఇష్టపడే వాటినే వండి వడ్డించాలి. బడిలో పిల్లలంతా ఆస్వాదిస్తూ తినాలి. ఇదీ కూటమి సర్కారు సంకల్పం. ఆ దిశగా మెనూలో మార్పులకు ప్రభుత్వం అభిప్రాయ సేకరణ చేపడుతోంది. ఉపాధ్యాయులు, వంటకాలు తయారుచేసే వారి నుంచి వివరాలు రాబడుతోంది. విద్యార్థులకు త్వరలో రుచుల విందు అందనుంది.

ఏ ప్రాంతవాసుల అభిరుచికి తగ్గట్టుగా ఆ ప్రాంత మధ్యాహ్న భోజనం పాఠశాలల్లో విద్యార్థులకు అందించాలి.. ఇదీ కూటమి సర్కారు సంకల్పం. ఈ బాధ్యతలను కలెక్టర్లకు అప్పగించింది. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం గ్రామీణం సత్యసాయి గురుకులం పాఠశాలలో పీఎం పోషణ(ఎండీఎం) డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకానికి సంబంధించి జిల్లాస్థాయి శిక్షణ కార్యక్రమం, కార్యశాలను కలెక్టర్ పి.ప్రశాంతి ఆధ్వర్యంలో ఈ మధ్యే నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుల నుంచి బడి భోజనంలో చేయాల్సిన మార్పులను సేకరించారు. ఓ ప్రముఖ హోటల్ నుంచి కుక్‌ను రప్పించి రుచికరంగా ఎలా వండాలో నేర్పించారు. మధ్యాహ్న భోజనాన్ని వండి, వడ్డించే ఆయాలను సైతం ఇందులో భాగస్వాములను చేశారు.



మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు(పాతచిత్రం)

ఇదీ ప్రస్తుత పరిస్థితి

రాజమహేంద్రవరంలో నగరపాలక సంస్థకు చెందిన ఓ పాఠశాలలో సుమారు 900 మంది విద్యార్థులుంటే 580 మాత్రమే మధ్యాహ్న భోజనం చేస్తున్నారు. మరో పాఠశాలలో 450 మందికి కేవలం 200 మంది కూడా తినని పరిస్థితి. ఉడకని అన్నం, నచ్చని కూరే దీనికి 90 శాతం కారణమని వంటలు వండే ఆయాలే స్వయంగా అధికారుల ఎదుట చెప్పారు. జిల్లాలోని కొన్ని పాఠశాలలకు ఇస్కాన్ నుంచి భోజనం వస్తుంది. మెనూ ప్రకారం వంటకాలు చేసి విడిగా ఉడికించిన గుడ్లు ఇస్తున్నారు. మరికొందరు పిల్లలు గుడ్డు ఉన్న రోజు మాత్రమే పాఠశాలలో భోజనం చేస్తున్నారు.

ఇవీ సూచనలు

◆ సాధారణంగా గోదావరి పరివాహక ప్రాంత ప్రజలు పులుసు, ఇగురు కూరలను ఇష్టపడుతుంటారని, గుడ్డు పులుసు వంటివి మెనూలో చేర్చాలని కొందరు ఉపాధ్యాయులు సూచించారు. ◆ ఉడకని, నూకలుగా, జావగా ఉండే అన్నంలో మార్పు వస్తే 90 శాతం మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని ఇష్టంగా తినే అవకాశం ఉందని ఆయాలు సూచించారు. ◆ కాస్త వేడి తగిలితే జావగా మారిపోతుందని బియ్యంలో మార్పులు తీసుకురావాలన్నారు. ◆ సాంబార్‌బాత్ కాయగూరలతో కలిపి కాకుండా సాంబారు విడిగా.. అన్నం విడిగా అందించాలని కలెక్టర్‌కు నివేదిక అందించారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

వినతులకు నిర్దేశిత సమయంలో పరిష్కారం

దానవాయిపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే వినతులకు నిర్దేశించిన సమయంలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ డి.నరసింహకిషోర్ పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం వినతులు స్వీకరించారు. జిల్లాలోని నలుమూలల నుంచి 34 మంది అర్జీలు అందించగా.. ఎస్పీ పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత డీఎస్పీలకు సూచించారు.

నేటి నుంచి జిల్లా మీదుగా ప్రత్యేక రైళ్లు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): దసరా పండగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా మంగళవారం నుంచి ఈ నెల 12 వరకు జిల్లా మీదుగా రెండు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు సోమవారం దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. ఇవి జిల్లా పరిధిలోని రాజమహేంద్రవరం, నిడదవోలు రైల్వేస్టేషన్లలో ఆగుతాయని తెలిపారు. కాకినాడ టౌన్-సికింద్రాబాద్(07071) ప్రత్యేక రైలు ఈ నెల 8, 10, 12 తేదీల్లో నడుస్తుంది. రాత్రి 9 గంటలకు కాకినాడలో బయలుదేరే ఈ రైలు మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. సికింద్రాబాద్-కాకినాడ టౌన్(07072) ప్రత్యేక రైలు ఈ నెల 9, 11 తేదీల్లో నడుస్తుంది. ఈ రైలు సాయంత్రం 6.15 గంటలకు సికింద్రాబాద్‌లో బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.30 గంటలకు కాకినాడ చేరుకుంటుంది.

లైక్.. షేర్ చేస్తే డబ్బులు రావు

– న్యూస్‌టుడే, దానవాయిపేట (రాజమహేంద్రవరం)

డబ్బులు ఎవరైనా ఊరికే ఎందుకిస్తారు? లైక్ చేయండి.. షేర్ చేయండి.. మీ బ్యాంకు ఖాతాలో నగదు వేస్తామని రూ.వెయ్యి, రెండు వేలు ఎర వేసి ఆన్‌లైన్ మోసగాళ్లు రూ.లక్షలు దోచుకుంటున్నారు. ఇలాంటి మోసాలపై పోలీసులు, సైబర్ నిపుణులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఇటువంటి సంఘటనలు బయటపడుతూనే ఉన్నాయి. ఆన్‌లైన్ మోసాల బారిన పడుతున్నవారిలో అత్యధిక శాతం విద్యావంతులే కావడం పోలీసులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఏమీ చదువుకోకపోయినా గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి ఓటీపీ చెప్పమంటే అవతల వ్యక్తికి మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నవారు ఉన్నారు. అలాంటిది విశ్రాంత ఉపాధ్యాయుడు, డాక్టర్, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్, బ్యాంకు విశ్రాంత ఉద్యోగులు సైబర్ మోసాల బాధితుల్లో ఉండడం గమనార్హం.

యాప్ పేరిట మోసం

ఇటీవల జిల్లాలోని పలువురు ఓ యాప్‌లో రూ.వేలల్లో నగదు జమచేసి టాస్క్ తీసుకున్నారు. యాప్‌లో వచ్చిన వీడియోలను లైక్, షేర్ చేస్తే రూ.లక్షల్లో నగదు వస్తుందని నమ్మి 15 మందికి పైగా జిల్లావాసులు మోసపోయారు. వారిలో ప్రభుత్వ ఉద్యోగులు, విద్యావంతులు, పోలీసు సిబ్బంది కుటుంబికులు ఉన్నారు. జిల్లా ఎస్పీని కలిసి జరిగిన మోసాన్ని వీరు వివరించారు. దీంతో ఆయా స్టేషన్ల పరిధిలో కేసులు నమోదు చేయాలని ఎస్పీ ఆదేశించారు.

ఏం చేస్తారంటే..



ఐఎఎస్ అనే యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో వీడియోలు వస్తుంటాయి. మన పూర్తి వివరాలు నమోదు చేసి ఉచితంగానే లాగిన్ అవ్వవచ్చు. అనంతరం అక్కడ ఉన్న వీడియోలను లైక్, షేర్, సబ్‌స్క్రైబ్ చేసిన అనంతరం స్క్రీన్ షాట్ తీసి అప్‌లోడ్ చేస్తే రోజుకు రూ.75 చొప్పున యాప్‌లోని మన వ్యాలెట్‌లో వేస్తామని నేరగాళ్లు ఆశ చూపుతున్నారు. అలా జిల్లాలో పలువురు ముందుగా నాలుగు రోజులు ఈ టాస్క్ చేయగా అందరికీ రూ.300 వ్యాలెట్‌లోకి వచ్చింది. అనంతరం ఆ మొత్తం బ్యాంకు ఖాతాలో జమ అయింది. అనంతరం ఏడాది కాలపరిమితితో ఉన్న రూ.2,100 టాస్క్ తీసుకుంటే రోజుకు రూ.75 నగదు వస్తుందని, రూ.5,500 టాస్క్‌తో రోజుకు రూ.200, రూ.18 వేలు టాస్క్‌తో రూ.600 చెల్లిస్తామని యాప్ నిర్వాహకులు నమ్మబలికారు. నగదు వస్తుందనే ఆశతో 14 మంది రూ.18 వేలు టాస్క్‌కు నగదు చెల్లించారు. రోజువారీ వస్తున్న నగదు యాప్ వ్యాలెట్‌లో చేరినట్లు చూపేది. దానిని బ్యాంకు ఖాతాకు మార్చుకునే వీలు మాత్రం ఉండేది కాదు. నిలదీస్తే సాంకేతిక లోపం కారణంగా ఇలా జరిగిందని, సరిచేస్తామని సైబర్ నేరగాళ్లు మాయమాటలు చెప్పేవారు. రోజులు గడుస్తున్నా ఫలితం లేకపోవడంతో మోసపోయామని గ్రహించి బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదు చేస్తే..

నష్టపోయిన నగదు రూ.15 వేలు పైన ఉంటే ఆన్‌లైన్ మోసం జరిగిన 48 గంటల్లోపు టోల్‌ఫ్రీ నంబరు 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి. ఐటీ కోర్ పోలీసు బృందం స్పందించి బ్యాంకు ఖాతాను స్తంభింపజేస్తారు. నగదు వెనక్కి రప్పిస్తారు. నష్టపోయిన నగదు రూ.15 వేలు లోపే ఉంటే జాతీయ సైబర్ నేరాల పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేసి వివరాలు ఐటీ కోర్ విభాగానికి పంపిస్తారు.

కనీస పింఛను రూ.9 వేలు చెల్లించాలని డిమాండ్

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: ఈపీఎస్-95 పెన్షనర్లకు కనీస పింఛను రూ.9 వేలు డీఏతో కలిపి చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రిటైర్డు పెన్షనర్ల అసోసియేషన్(ఏపీఆర్‌పీఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్‌వో) రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. సంఘ నాయకులు సోమేశ్వరరావు, సి.హెచ్.మోహనరావు, కె.సత్తిరాజు, సీఐటీయూ నాయకులు ఎస్.ఎస్.మూర్తి, పూర్ణిమరాజు తదితరులు మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులు చాలీచాలని పింఛనుతో వృద్ధాప్యంలో బతకడం చాలా కష్టమన్నారు. ఈపీఎస్-95 పెన్షనర్లకు హైయర్ పెన్షన్ అమలు చేయాలని, రైల్వే ప్రయాణంలో రాయితీ పునరుద్ధరించాలని, భార్యభర్తల ఇద్దరికీ వైద్య సదుపాయాలు కల్పించాలని పీఎఫ్ కమిషనర్ మనోజ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు.



ధర్నాలో విశ్రాంత ఉద్యోగులు

ఉద్యోగ మేళా రేపు

వి.ఎల్.పురం: కలెక్టరేట్ వద్ద ఉన్న న్యాక్ కేంద్రంలో ఈ నెల 9న ఉద్యోగ మేళా జరుగుతుందని జిల్లా నైపుణ్యాధికారి జి.సుధాకర్, జిల్లా ఉపాధి కల్పన అధికారి హరిశ్చంద్రప్రసాద్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ మేళాలో నాలుగు కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై ఆయా ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. ఎస్ఎస్‌సీ ఇంటర్, డిగ్రీ విద్యార్హతలు కలిగి 19 నుంచి 30 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు.

నాటుకోళ్ల పెంపకంతో భలే ఆదాయం

రైతేరాజు | స్ఫూర్తి

పి.గన్నవరం, న్యూస్‌టుడే: పది ఎకరాలు వరి సాగు చేశారు. ప్రకృతి సహకరించలేదు.. ఏటా ఏదో విధంగా నష్టాలే.. దీని నుంచి ఎలా బయటపడాలా అని రైతన్న నాటుకోళ్ల పెంపకం గురించి ఆలోచించారు.. ఆలోచన ఆచరణలో పెట్టి లాభాలు గడిస్తున్నారు మండలంలోని జి.పెదపూడికి చెందిన ఇందుకూరి వీరభద్రరాజు. ఆయనకు నాటుకోళ్లలో నాణ్యమైన జాతిపట్ల అవగాహన ఉంది. నాణ్యమైన గుడ్లు సేకరించి పిల్లలు చేయించి వాటిని పెంచుతూ పెట్టలు, పుంజులు విక్రయించడం మొదలు పెట్టారు. మొదట్లో 50 పెట్టలు, ఆరు పుంజులతో మొదలు పెట్టిన ఆయన ఏటా వీటి సంతతిని పెంచుతూ గుడ్లు మొదలుకుని కోడి వరకు విక్రయిస్తున్నారు. కోడిపెట్ట రూ.1500ల వరకు విక్రయిస్తారు. ప్రధానంగా కోడిపుంజులకు మంచి డిమాండు ఉంటుంది. పుంజుల పెంపకంపై మరింత శ్రద్ధ పెడుతున్నారు. మేత మొదలుకుని మందుల వరకు అన్ని విషయాల్లోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. నాణ్యమైన కోడిపుంజు పూర్తిస్థాయిలో ఎదిగిన తరువాత రూ.25వేల నుంచి రూ.30వేల వరకు ధర పలుకుతుంది. ఏడాదికి 50 కోడిపుంజులు విక్రయిస్తే రూ.15లక్షలు వరకు వస్తుంది. దీంట్లో మేత తదితర నిర్వహణ ఖర్చులు, కూలి ఖర్చులు పోను రూ.8 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఇక పెట్టలు, పిల్లలు విక్రయించడం ద్వారా మరో రూ.3 లక్షలు ఆదాయం పొందుతున్నారు. కోళ్లకు మునగ, బొప్పాయి, ఆకు కూరలు, కూరగాయలు మేతగా వేస్తున్నారు. మునగ, బొప్పాయి ఆకులు మేతగా పెట్టడం ద్వారా మేత ఖర్చు తగ్గడమే కాకుండా కోళ్లకు రోగ నిరోధకశక్తి పెరుగుతుందని రైతు వీరభద్రరాజు తెలిపారు.



నాటుకోళ్లకు మేతవేస్తున్న ఇందుకూరి వీరభద్రరాజు

యాజమాన్య పద్ధతులతో ఆకుకూరల సాగు

న్యూస్‌టుడే, ఆత్రేయపురం

వేగంగా పెరిగి, అనతి కాలంలో చేతికందే పంటల్లో తోటకూర, పాలకూర ముఖ్యమైనవి. వీటి సాగుతో మంచి లాభాలు పొందవచ్చని **కొత్తపేట డివిజన్ ఉద్యాన శాఖాధికారి డాక్టర్ కోటేశ్వరరావు** సూచించారు. తోటకూర సాగుకు ఆర్.ఎన్.ఎ-1, కో-1, 2, పూసకీర్తి, కిరణ్ వంటి రకాలు అనుకూలం. పాలకూర సాగుకు పూస జ్యోతి, పూసాహరిత్ వంటి రకాలు అనువుగా ఉంటాయి. విత్తనం వేసే ముందు పశువుల ఎరువుతోపాటు ఎకరాకు 20 కిలోల భాస్వరం, 20 కిలోల నత్రజని, 20 కిలోల పొటాష్‌లను ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నాలి. తోటకూర, పాలకూరకు ఒక్కోసారి పాము పొడ, ఆకుతినే పురుగులు వ్యాపించే అవకాశం ఉంటుంది. అలాంటప్పుడు పదిరోజుల మొక్కలపై లీటరు నీటికి 5 మి.లీ వేపనూనె, గ్రాము సబ్బుపొడి కలిపి పైరంతా తడిచేలా పిచికారీ చేయాలి. తెల్లమచ్చల చిత్తపురుగుల బెడద ఉంటే ఆకు కోత అనంతరం లీటరు నీటికి 1 మి.లీ డైక్లోరోవాస్ కలిపి చల్లాలి. తెల్ల తుప్పు తెగులు ఆశిస్తే ఆరంభ దశలో తెగులు సోకిన మొక్కలను పీకివేయాలి. పక్షి కన్ను తెగులు ఆశిస్తే లీటరు నీటికి 2.5 గ్రాములు మ్యాంకోజెబ్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేసి నివారించవచ్చు.



ఆత్రేయపురంలో సాగవుతున్న ఆకుకూరలు

మీ కోసం

ఆయిల్‌పామ్‌లో కాండం తడి తెగులు

తెలుసుకుందాం..

బిక్కవోలు: ఆయిల్‌పామ్ మొక్కలను ఆశించే తెగుళ్లలో కాండం తడి తెగులు ఒకటి. దీని లక్షణాలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డా. వైఎస్ఆర్ విశ్వవిద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త (ఉద్యాన) డా.జి.రామానందం పలు సూచనలు చేశారు.

తెగులు లక్షణాలు: తెగులు సోకిన చెట్టు మధ్యవరుసలో ఆకులు గోధుమవర్ణంలోకి మారతాయి. ముదురు ఆకులు చనిపోయిన తరువాత ఆ తెగులు లేత ఆకులకు సోకుతుంది. కాండంపై గడ్డపారతో గాయం చేస్తే దాని నుంచి గోధుమ వర్ణంలో భరించలేని దుర్వాసనతో ద్రవం వస్తుంది. ఈ తెగులు తీవ్రంగా ఉన్నపుడు చెట్టు కాండం బెరడు కొద్దిగా మాత్రమే గట్టిగా ఉండి లోపలి కణజాలం కుళ్లిపోతుంది.

నివారణ: తెగులు సోకిన చెట్లను తొలగించి కాల్చివేయాలి. ఆరంభ దశలో ఉంటే కాండానికి శస్త్ర చికిత్స చేసి చెట్టు రక్షించవచ్చు. కాండంపై గాట్లు పెట్టి కుళ్లిన కణజాలాన్ని దాని ఆనుకుని ఉన్న కణజాలాన్ని తొలగించాలి. దానిపై 1 శాతం కార్బండిజమ్, మోనోక్రోటోపాస్ మిశ్రమాన్ని కలిపి పూసి, ఆపై కోల్‌తారును పూయాలి.



కాండం తడి తెగులు సోకిన మొక్క

కొబ్బరి తోటల్లో ఇలా చేద్దాం

ప్రశ్న సమాధానం

? ప్రశ్న: కొబ్బరితోట వయస్సు 20 సంవత్సరాలు, కొబ్బరికాయల పరిమాణం తగ్గిపోతుంది. దిగుబడి కూడా ఎక్కువ రావడంలేదు. ఏం చేయాలి.
- జి.శ్రీనివాసరావు, అమలాపురం

సమాధానం: వాతావరణ పరిస్థితులను బట్టి చీడపీడలు పెరిగి కాయల ఎదుగుదలపై ప్రభావంపడుతోంది. గతేడాది వేసిన ఎరువులను బట్టి కాంప్లెక్స్ ఎరువులు వాడితే వాటి బదులు సూటి ఎరువులైన యూరియా, సింగిల్ సూపర్‌ఫాస్ఫేట్, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ రూపంలో తోటల్లో వేయాలి.
- కిరీటి, ఉద్యానపరిశోధన కేంద్రం శాస్త్రవేత్త



? కొబ్బరితోటల్లో మొవ్వులు సుడులు తిరిగినట్లు వస్తున్నాయి.నివారణ చర్యలు చెప్పండి.
- ఆర్.వెంకటేశ్వరరావు, అంబాజీపేట

కొబ్బరితోటల్లో మొవ్వ ఆకులు ప్రతి నెలా ఒకటి రావడం గమనించవచ్చు. ఆ క్రమంలో కొమ్ముపురుగు ఆశించడం వల్ల ఈ మొవ్వ అనేది వంకరగా వస్తుంది. అలా కాకుండా బోరాన్ లోపంతో కూడా ఇలా మొవ్వులు సుడులు రావడానికి ఆస్కారం ఉంది. వీటిని పరిశీలించుకుని బోరాన్ లోపానికి బోరాక్స్ మందులు ఒక మొక్కకి 100 గ్రాములు వేస్తే క్రమంగా ఆరోగ్యవంతమైన మొక్క పెరగడానికి ఆస్కారం ఉంటుంది.
- కిరీటి, శాస్త్రవేత్త

– న్యూస్‌టుడే, అంబాజీపేట

టైర్ పేలి వ్యాన్ బోల్తా

- ముగ్గురికి తీవ్ర గాయాలు
- 27 గొర్రెలు మృతి

దేవరపల్లి, న్యూస్‌టుడే: అతివేగంగా వస్తున్న వ్యాన్ టైర్ పేలిపోవడంతో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా 27 గొర్రెలు మృతి చెందాయి. హైవే పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. గుంటూరు జిల్లా నుంచి సోమవారం రాత్రి విశాఖపట్నం గొర్రెల లోడుతో వెళుతున్న వ్యాన్ దేవరపల్లి సమీపంలోకి వచ్చే సరికి టైర్ పేలిపోవడంతో అదుపుతప్పి బోల్తా పడింది. వ్యాన్‌లో ప్రయాణిస్తున్న ఐదుగురులో ఇద్దరికి స్వల్ప, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. 27 గొర్రెలు మృతి చెందాయన్నారు. క్షతగాత్రులు ముగ్గురిని హైవే అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. అనంతరం హైవే సిబ్బంది, పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఈ సంఘటనకు సంబంధించి క్షతగాత్రుల వద్ద నుంచి ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు.



దేవరపల్లి సమీపంలో జాతీయ రహదారిపై బోల్తా పడిన వాహనం

విధుల్లోనే కుప్పకూలి మృతి

దేవరపల్లి: ఉదయం ఆరు గంటలకు విధులకు వెళ్లిన వ్యక్తి ఎనిమిది గంటల ప్రాంతంలో ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణాలు వదిలారు. యర్నగూడెంలో సోమవారం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. దేవరపల్లి మండలం త్యాజంపూడికి చెందిన నాగిరెడ్డి గంగయ్య ప్రభువు(48) ఆరేళ్లుగా 3 ఎఫ్ ఆయిల్‌పామ్ కర్మాగారంలో ఎఫ్ఎఫ్‌బీ (ఫ్రెష్ ఫ్రూట్ బంచ్)లో సూపర్ వైజర్‌గా పని చేస్తున్నారు. ఇతనికి వివాహమైంది. ఇద్దరు పిల్లలున్నారు. రోజూ మాదిరిగా సోమవారం ఉదయం 6 గంటలకు కర్మాగారంలో విధులకు హాజరయ్యారు. 8 గంటల సమయంలో ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయారన్నారు. చికిత్స నిమిత్తం దేవరపల్లి పీహెచ్‌సీకి తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గోపాలపురం సీహెచ్‌సీకి తరలించినట్లు తెలిపారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుబ్రహ్మణ్యం తెలిపారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	14,000-15,000
కొత్త (పచ్చి) కాయ	13,500-14,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ.లో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

ఉపాధి లక్ష్యాల సాధనకు ఆదేశం

రాజమహేంద్రవరం కలెక్టరేట్: ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన పనిదినాల లక్ష్యాలను నూరుశాతం పూర్తి చేయాలని జేసీ చిన్నరాముడు అధికారులను ఆదేశించారు. రెవెన్యూ డివిజన్, మండలస్థాయి అధికారులతో ఉపాధి హామీ, గృహనిర్మాణం, రెవెన్యూ అంశాలకు సంబంధించి శాఖల వారీ పనితీరుపై డీఆర్వో నరసింహులుతో కలిసి సోమవారం సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ ఈ నెలాఖరు నాటికి 39.09 లక్షల పనిదినాల లక్ష్యం నిర్దేశించగా ఇప్పటివరకు 34.83 లక్షలు పూర్తి చేశారన్నారు. కొన్ని మండలాల్లో 70 శాతం మేరకే పరిమితమవ్వడమేంటని ప్రశ్నించారు. నివేదికలు అడిగిన ప్రతిసారీ రేపు పంపుతామంటూ సమాధానం ఇవ్వడంపై జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ అంశాల పరిష్కారం విషయంలో ఎందుకు సమయపాలన పాటించడం లేదని ప్రశ్నించారు.

రాజమహేంద్రవరం

కోర్లమ్మపేట వీధులు.. దుర్గంధ దారులు

నగరంలోని దేవీచౌక్‌ను ఆనుకుని ఉన్న కోర్లమ్మ పేటలోని వీధులు చెత్త, చెదారంతో నిండిపోతున్నాయి. గతంలో మాదిరి చెత్త కుండీలు లేకపోవడంతో వీధి చివర్లు చెత్త మయంగా మారుతున్నాయి. నగరపాలక సంస్థ పారిశుద్ధ్య సిబ్బంది ఇంటింటా చెత్త సేకరణకు వచ్చినా పోగైన చెత్తను రోడ్డుపక్కన వేసి, తర్వాత తరలిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. దీంతో ప్రతీ వీధిలోనూ ఏదో ఒకచోట చెత్త పేరుకుపోయి కనిపిస్తోంది. దీనివల్ల దుర్వాసనతో పాటు దోమలబెడద ఎక్కువ అవుతోంది. విద్యుత్తు తీగలకు తాకుతున్నాయనే కారణంతో విద్యుత్తు సిబ్బంది ఇటీవల చెట్ల కొమ్మలు నరికి వీధిలోనే వదిలేశారు. అయిదు రోజులైనా వాటిని తొలగించలేదని స్థానికులు తెలిపారు. దేవీచౌక్‌ను ఆనుకుని ఉన్న ఈ ప్రాంతం నిత్యం రద్దీగానే ఉంటుంది. ప్రస్తుతం దసరా ఉత్సవాల సందర్భంగా మరింత ఎక్కువగా ఉంటుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి ఇబ్బంది లేకుండా చూడాలని నివాసితులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, దేవీచౌక్



కాలనీ వీధుల్లో చెత్త



రోడ్డుపైనే వదిలేసిన చెట్ల కొమ్మలు

విశాఖకు 5 అదనపు బస్సులు

మొదలైన పండగ ప్రయాణాలు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం): దసరా పండగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రాజమహేంద్రవరం నుంచి విశాఖకు సోమవారం అయిదు అదనపు బస్సు సర్వీసులు నడిపారు. ప్రతిరోజూ ఇక్కడి ప్రధాన బస్టాండ్ నుంచి విశాఖకు ఎనిమిది సర్వీసులు నడుస్తున్నాయి. ప్రస్తుతం ప్రయాణికుల డిమాండ్ పెరగడంతో అదనంగా అయిదు బస్సులు తిప్పినట్లు రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.కె.షబ్నం తెలిపారు.

నేటి నుంచి హైదరాబాద్‌కు..

హైదరాబాద్‌కు మంగళవారం నుంచి ప్రత్యేక సర్వీసులు నడపనున్నారు. అక్కడ్నుంచి పండగకు సొంతూళ్లకు వచ్చే ప్రయాణికుల కోసం జిల్లాలోని నాలుగు డిపోల నుంచి ఈ నెల 11వ తేదీ వరకు సాధారణ టికెట్ ఛార్జీతో 37 ప్రత్యేక సర్వీసులు తిప్పేందుకు ఇప్పటికే కార్యాచరణ ప్రణాళిక రూపొందించి బస్సులను సిద్ధం చేశారు. డిమాండ్‌కు అనుగుణంగా హైదరాబాద్ స్పెషల్స్ తిప్పేందుకు ఆన్‌లైన్ టిక్కెట్ బుకింగ్ సౌకర్యం కల్పించారు. ప్రస్తుతం ప్రతిరోజూ రాజమహేంద్రవరం డిపో నుంచి నాలుగు, గోకవరం డిపో నుంచి ఒకటి, నిడదవోలు డిపో నుంచి ఒకటి, కొవ్వూరు డిపో నుంచి రెండు చొప్పున హైదరాబాద్ షెడ్యూల్ సర్వీసులు నడుస్తుండగా మంగళవారం నుంచి స్పెషల్ సర్వీసులు నడిపేందుకు నిర్ణయించి సోమవారం రాత్రి ఒక ప్రత్యేక బస్సును రాజమహేంద్రవరం నుంచి పంపించారు. ఇది అక్కడ ఉదయం బయలుదేరి జిల్లాకు చేరుకుంటుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. రద్దీకి అనుగుణంగా దూరప్రాంతాలకు అదనపు సర్వీసులు ఏర్పాటు చేస్తామన్నారు.

సినిమాలు: దానవాయిపేట: రాజా, వీఎస్ మహల్, అశోక, కుమారి, సూర్యప్యాలస్, అప్సర: దేవర, స్వామి, అనుశ్రీ: స్వాగ్, శ్యామల: 35 చిన్నకథకాదు, సూర్యమినీ: దక్షిణ, శివజ్యోతి: రామ్‌నగర్ బన్నీ, రంభ: కమిటీ కుర్రోళ్లు, ఊర్వశి: సత్యం సుందరం, మేనక: మత్తు వదలరా-2, మిస్టర్ సెలబ్రిటీ(రెండు ఆటలు).

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

దేవీచౌక్: నగరంలో పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ శామ్యూల్ తెలిపారు.

సమయం: ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు

ప్రాంతాలు: హౌసింగ్ బోర్డు కాలనీ, ధర్మపురి కాలనీ, మృత్యుంజయ నగర్, లక్ష్మీనగర్, పంచాయితీ కార్యాలయం ప్రాంతం, ఏడు ఎకరాల లేఔట్.



నృత్యాభినయం

రాజమహేంద్రవరం సాంస్కృతికం : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం సరస్వతీఘాట్ వేదికపై జరిగిన నృత్య ప్రదర్శనలు అలరించాయి. అడ్డాల నాగేశ్వరరావు నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో త్యాగరాజ, అన్నమాచార్య కీర్తనలకు చిన్నారులు చేసిన నృత్యాభినయం ఆకట్టుకుంది.

మేమున్నాం.. మీకు తోడుగా

మీ ప్రాంతంలో ప్రజా సమస్యలు ఇబ్బంది పెడుతున్నాయా? ప్రభుత్వం నుంచి సక్రమంగా అందాల్సిన లబ్ధి మీకు చేరలేదా? ఇలా ఏ సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. చిత్రాలను, వివరాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

సమస్యలపై సంప్రదించాల్సిన నంబరు
80089 02897
83282 39927

మౌలిక వసతుల కల్పనకు వినతి



అర్జీ పరిశీలిస్తున్న ఎస్ఈ పాండురంగారావు

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఈ పాండురంగారావు తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పరిష్కార వేదికలో పాల్గొని బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. నగరంలో పారిశుద్ధ్యం, తాగునీరు, మౌలిక వసతుల కల్పనపై మొత్తం 16 వినతులు వచ్చాయి. డిప్యూటీ కమిషనర్ రమణ, సిటీ ప్లానర్ కోటయ్య, ఎంహెచ్ఓ వినూత్న తదితరులు అర్జీలు స్వీకరించారు. ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ రెవెన్యూ అధికారి కృష్ణ నాయక్ దరఖాస్తులను స్వీకరించారు. భూ సమస్యలు, సర్వేపై ఆరుగురు అర్జీలు అందించారు.

వృద్ధులకు ఆర్థిక సాయం



రాజమహేంద్రవరం సాంస్కృతికం: వికాస్ సొసైటీ ఆధ్వర్యంలో 100 మంది వృద్ధులకు రూ.200 చొప్పున ఆర్థిక సాయం, అల్పాహారం సోమవారం అందించారు. వి.ఎల్.పురం పార్కులో సంస్థ నిర్వాహకుడు యార్లగడ్డ ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సొంతింటికి ఎప్పుడెళ్తామో..

టిడ్కో లబ్ధిదారుల ఎదురుచూపు





లాలాచెరువు ప్రాంతంలో అద్దె ఇంట్లో ఉంటున్న వాసంశెట్టి సావిత్రికి బొమ్మూరులో టిడ్కో ఇల్లు మంజూరైంది. మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించక ఇప్పటివరకు అప్పగించలేదు.



నామవరంలో టిడ్కో ఇంటి కోసం రూ.లక్ష చెల్లించారు భాగ్యలక్ష్మి, బాబూరావు దంపతులు. రెండేళ్లుగా తిరుగుతున్నా ఇల్లు అప్పగించడం లేదు.

టిడ్కో గృహాల కోసం ఏళ్లుగా లబ్ధిదారుల బాధలివి. పేదలకు సొంతింటి కల సాకారం కావడం లేదు. అయిదేళ్ల వైకాపా పాలనలో అప్పుల భారం మిగిలిందే తప్ప గూడు చేరువ కాలేదు. మరికొన్నింటికి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా పూర్తి కాలేదు. దీంతో లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతునే ఉన్నారు.

– న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

నగరంలో పలువురు పేదల కోసం ఫేజ్ 1, 2 కలిపి మొత్తం 6,304 టిడ్కో గృహాలను నిర్మించ తలపెట్టారు. వీటిలో ఫేజ్-1 ప్రక్రియ పూర్తయ్యింది. వైకాపా హయాంలో ఫేజ్-2 ప్రక్రియ ప్రారంభించినా ఇప్పటికీ కొలిక్కి రాలేదు. ఇప్పటికీ 730 గృహాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తికాలేదు. రిజిస్ట్రేషన్లు పూర్తయితే గానీ బ్యాంకులు రుణాలు మంజూరు చేయవు. దీంతో గృహ లబ్ధిదారులంతా అయిదేళ్లుగా కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో ఆదేశాల కోసం అధికార యంత్రాంగం ఎదురు చూస్తోంది.

అయిదేళ్లుగా ఇదే తీరు

ఫేజ్-2లో భాగంగా బొమ్మూరులో 1,200, నామవరంలో 1,104 గృహాల నిర్మాణం తలపెట్టారు. ఇక్కడ కాలువలు, తాగునీటి పైపులైన్ వ్యవస్థ ఏర్పాటు చేయాల్సి ఉంది. దీంతో ఇల్లు మంజూరైనా ఇంకా చేతికి అందక అద్దె ఇంట్లో ఉంటూ లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో పనులు దక్కించుకున్న గుత్తేదారులు నత్తనడకన నిర్మాణాలు చేపడుతున్నారు.

ఇవీ సమస్యలు

మౌలిక వసతుల పేరుతో ఆలస్యం చేయడంతో ఇంటి నిర్మాణాలు దెబ్బతింటున్నాయి. కిటికీలు, తలుపులు పాడైపోతున్నాయి. గృహాల్లో ఎవరూ నివాసం ఉండకపోవడంతో విద్యుత్తు తీగలు, ఇనుప గ్రిల్స్‌ను దుండగులు చోరీ చేస్తున్నారు. దీంతో ఇల్లు స్వాధీనం చేసుకున్న తర్వాత తిరిగి మరమ్మతులు చేసుకోవాల్సిన పరిస్థితి. యంత్రాంగం స్పందించి రిజిస్ట్రేషన్లతోపాటు మౌలిక వసతులు మెరుగుపర్చాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

సాయం అందజేత



తోపుడుబండి అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

టి.నగర్, న్యూస్‌టుడే: అర్హులకు పింఛన్లు మంజూరు చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చెప్పారు. తిలక్ రోడ్డులో భవానీ ఛారిటబుల్ ట్రస్ట్ తరపున పలువురికి పింఛన్లు అందజేశారు. చిరు వ్యాపారికి నాలుగు చక్రాల తోపుడు బండిని ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ వైఖరితో కొందరికి అర్హత ఉన్నా పింఛను రాలేదన్నారు.

✦ జీఎస్ఆర్ ఫౌండేషన్, ఎన్టీఆర్ ట్రస్ట్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ రక్తనిధి కేంద్రాన్ని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు సోమవారం సందర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ రవి రామ్‌కిరణ్, బ్లడ్ బ్యాంకు మేనేజర్ వెంకట్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

బాలలతో పనులు చేయిస్తే కఠిన చర్యలు

పాడేరు, న్యూస్‌టుడే: బాలలతో పనులు చేయించుకుంటే కఠిన చర్యలు చేపడతామని ఐటీడీఏ పీఓ వి.అభిషేక్ హెచ్చరించారు. హుకుంపేట మండలం దొంతురాయి గ్రామానికి చెందిన కాకరి ప్రమీల కుమార్తె మోహితదేవి(9)ని రాజమహేంద్రవరం తరలించి ఇంట్లో పనులు చేయిస్తున్న ఇదే గ్రామానికి చెందిన శెట్టి మనోహర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బాలికను వెంటబెట్టుకుని ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో పీవోను కలిశారు. అనంతరం పీడీ మాట్లాడుతూ దీనికి సంబంధించిన వివరాలు తెలిపారు. మోహితదేవి దొంతురాయి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. రెండు నెలల క్రితం మనోహర్ తన పిల్లలతో పాటు మోహితదేవిని రాజమహేంద్రవరం తీసుకెళ్లి.. తన ఇంట్లో వెట్టిచాకిరీ చేయించసాగారు. ఎలాగో బాలిక తప్పించుకుని గోదావరి వంతెనపై నడిచి వెళ్తుండగా ఓ వ్యక్తి గమనించి పోలీసులకు అప్పగించారు. వారి సమాచారం మేరకు రంపచోడవరం సీడీపీఓ సంధ్యారాణి, అడ్డతీగల సీడీపీఓ సుధలను రాజమహేంద్రవరం పంపించారు. సీడీపీఓలు బాలికను పాడేరు తీసుకొచ్చి ఐసీడీఎస్ పీడీకి శనివారం అప్పగించారు. బాలికను బాలల సదనంలో చేర్పించాలని పీవో సూచించారు. బాలకార్మిక నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు.

విభిన్న రూపం.. వేడుక దేదీప్యం



దేవీచౌక్‌లో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రాజమహేంద్రవరం సాంస్కృతికం : నగరంలోని దసరా ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. విభిన్న రూపాల్లో అమ్మ దర్శనమిస్తున్నారు. ఉమా మార్కండేయస్వామి ఆలయంలో సోమవారం అమ్మవారి ఉత్సవమూర్తికి అన్నపూర్ణాదేవిగా అలంకరించి లలితా సహస్రనామ పారాయణం పఠించారు. వంకాయలవారి వీధిలోని అష్టలక్ష్మీ ఆలయంలో సంతానలక్ష్మీ అమ్మవారికి పట్టువస్త్రాలు, వివిధ రకాల పూలతో అలంకరించి కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో అమ్మవారికి పాస్తాలు, వడియాలతో అలంకరించి కుంకుమ పూజలు జరిపించారు.

● దేవీచౌక్‌లో ఉత్సవమూర్తికి శ్రీబాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించి రోహిణీ గౌరీ పూజ చేశారు. పెరుగు ఆవడలు నైవేద్యంగా సమర్పించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తల్లి వీరరాఘవమ్మతో కలిసి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

దేవీచౌక్‌లో నేడు
అలంకరణ: **శ్రీలలితా త్రిపుర సుందరీదేవి**
సాంస్కృతిక కార్యక్రమం: రాత్రి 10 గంటలకు మోహన్ సినీ సంగీత విభావరి



మార్కండేయస్వామి ఆలయంలో..



టింబర్ మర్చంట్ హాలులో..



అష్టలక్ష్మీ ఆలయంలో సంతానలక్ష్మిగా..



వడియాలతో వాసవీమాత అలంకరణ



గాయత్రీ పీఠంలో అమ్మవారు



దేవీచౌక్‌లో శ్రీబాలా త్రిపుర సుందరీదేవిగా..

విరాళం అందజేత

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద చేపట్టిన వకుళమాత నిత్యాన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరం మండలం బొమ్మూరుకు చెందిన మత్సేటి శివ, సత్యవతి దంపతులు రూ.50 వేల విరాళాన్ని సోమవారం అందజేశారు.

పుట్టినరోజు వేడుకల్లో కొట్లాట : ఇద్దరికి గాయాలు

రాజమహేంద్రవరం నేరవార్తలు: గోరక్షణపేటకు చెందిన యలమర్తి చెందు, అతడి మామయ్య వై.రవికుమార్ స్థానికంగా స్నేహితుడి పుట్టినరోజు వేడుక ఆదివారం రాత్రి నిర్వహించారు. ఆ నేపథ్యంలో తలెత్తిన వివాదంలో అదే ప్రాంతానికి చెందిన వై.సుభాష్, యోహాన్, బన్ని, ప్రసాద్ అనే యువకులు చెందు, రవిలపై ఇనుప రాడ్డుతో దాడి చేశారు. ఘటనలో గాయపడిన చెందు, రవిలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి వర్గాల సమాచారంతో ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కులం పేరుతో దూషించాడని..

గాంధీపురం ప్రాంతానికి చెందిన టి.శ్రీనివాసయాదవ్, ప్రకాశంనగర్ ప్రాంతానికి చెందిన సి.శాంతారామ్ మధ్య నగదు లావాదేవీల విషయంలో వివాదాలు నడుస్తున్నాయి. ఆ క్రమంలో ఈ నెల 4న మాట్లాడేందుకు పిలిచి తనను కులం పేరుతో దూషించడంతోపాటు చంపుతానని బెదిరించినట్లు శ్రీనివాస యాదవ్‌పై సోమవారం శాంతారామ్ ప్రకాశం నగర్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బాజీలాల్ తెలిపారు.

ట్రాలీ ఆటో ఢీకొని..

సుబ్బారావుపేటకు చెందిన ఎంవీవీ సత్యనారాయణ సోమవారం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ఓ ట్రాలీ ఆటో ఢీకొంది. ఆ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలు కావడంతో నగరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ మేరకు ఆసుపత్రి వర్గాలు మూడో పట్టణ పోలీసులకు సమాచారం ఇచ్చాయి.

చికిత్స పొందుతూ యాచకుడి మృతి

లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని జాతీయ రహదారి దాటుతున్న ఓ 65 ఏళ్ల యాచకుడిని గత నెల 28న రాత్రి ఆర్టీసీ బస్సు ఢీ కొంది. ఆ ప్రమాదంలో గాయపడిన యాచకుడు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లుగా ఆసుపత్రి వర్గాలు బొమ్మూరు పోలీసులకు సమాచారం ఇచ్చాయి. యాచకుడి వివరాలు తెలియరాలేదని, వీఆర్వో రామజోగి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రియ కుమార్ తెలిపారు.



పవన్ కల్యాణ్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: కోరుకొండరోడ్డు కనకదుర్గ ఆలయం వద్ద ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఫ్లెక్సీకి సోమవారం క్షీరాభిషేకం చేశారు. పవన్ సనాతన ధర్మ పరిరక్షణకు దీక్ష చేసిన సందర్భంగా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. అంతకుముందు కలశాల ఊరేగింపు గరగ నృత్యాలు, కోయ డ్యాన్సులు, మేళతాళాలతో సందడిగా సాగింది. ఆలయ కమిటీ సభ్యులు కంటిపూడి శ్రీనివాస్, పద్మావతి, జొన్నాడ వీరవెంకట సుబ్బారావు, శ్రీదేవి, మాజీ కార్పొరేటర్ జవ్వాది మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవకురాలు లక్ష్మీనరసమ్మ మృతి



రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే : నగరానికి చెందిన బ్రౌన్ మందిరం నిర్వాహకులు సన్నిధానం సోదరుల పెద్ద సోదరి, విశ్రాంత ఉపాధ్యాయిని ఇనుగంటి లక్ష్మీనరసమ్మ(83) సోమవారం మృతి చెందారు. ఈమె భర్త ఆదర్శ ఉపాధ్యాయుడు ఇనుగంటి సుబ్బారావు కొన్నేళ్ల క్రితమే మరణించారు. ఒకప్పటి లక్కవరం ఆస్థాన కవి కొత్తపల్లి సుందర రామయ్యకు లక్ష్మీనరసమ్మ మనవరాలు. విక్రమ హాలు, బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం గ్రంథాలయాల్లో జరిగిన అనేక కార్యక్రమాల్లో ఈమె కీలక పాత్ర పోషించారు. వావిలాల గోపాలకృష్ణయ్య, పాతూరి నాగభూషణం వంటి సమరయోధులకు, సాహితీవేత్తలకు తుమ్మలావలోని తమ గృహంలో ఆతిథ్యం ఇచ్చారు. ఆమె మృతికి నగరానికి చెందిన పలువురు సంతాపం తెలిపారు.

సీఐల బాధ్యతల స్వీకరణ





ఎస్పీకి మొక్క అందిస్తున్న సీఐలు అబ్దుల్ నబి, బాలసౌర్య

దానవాయిపేట: నగరంలోని ట్రాఫిక్-1 విభాగానికి సీఐగా నియమితులైన ఎండీ అబ్దుల్ నబి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నగర ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చేస్తానన్నారు. సీసీఎస్-1 విభాగానికి నియమితులైన ఇ.బాలసౌర్య బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ నేర పరిశోధన వేగవంతం చేసి త్వరితగతిన కేసులు విచారణ పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తానన్నారు. జిల్లా పోలీసు కార్యాలయానికి వెళ్లిన వీరు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు.

యుద్ధం.. ప్రపంచ శాంతికి విఘాతం

వి.ఎల్.పురం: పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధం ప్రపంచ శాంతికి విఘాతమని సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు ప్రపంచ పటంలో చోటులేని ఇజ్రాయెల్ నేడు పాలస్తీనాపై యుద్ధాలు చేస్తూ మెజారిటీ భూమిని ఆక్రమించిందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలస్తీనా సంఘీభావ దినం సందర్భంగా సోమవారం శ్యామలా సెంటర్ వద్ద పార్టీ కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. సీపీఎం నగర కమిటీ సభ్యుడు కర్రి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో అరుణ్ ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడారు. ఏ సమస్యనైనా యుద్ధంతో కాకుండా చర్చలతో పరిష్కరించుకుని ముందుకెళ్లాలన్నారు. సదస్సులో సీపీఎం నాయకులు రాంబాబు, పవన్, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు రమణ, జోజి తదితరులు మాట్లాడారు.



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి అరుణ్

ఖాళీ పోస్టుల భర్తీకి డిమాండ్

వి.ఎల్.పురం: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి వెంటనే ప్రకటించాలని భారత ప్రజాతంత్ర యువజ సమాఖ్య(డీవైఎఫ్ఐ) నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్యామల సెంటర్ వద్ద ప్రజాసంఘాల కార్యాలయంలో డీవైఎఫ్ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం రాంబాబు అధ్యక్షతన సోమవారం జరిగింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రయత్నాలకు వ్యతిరేకంగా యువత, ప్రజలను చైతన్యపరిచేందుకు సదస్సులు ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ నెల 19న నగరంలో డీవైఎఫ్ఐ జిల్లా విస్తృతసాయి సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా నాయకులు అశోక్‌కుమార్, ప్రసన్నకృష్ణ, జోసఫ్, నాని, శివప్రసాద్, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి అవకతవకలపై విచారణకు..

వి.ఎల్.పురం: ఉపాధి హామీ పథకంలో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని గోకవరం మండలం ఎదురపల్లి గ్రామానికి చెందిన పలువురు డిమాండ్ చేశారు. ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ పాల్పడిన అవకతవకలపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు గ్రామస్థులు పలువురు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పామాయిల్ తోటల నిర్వహణ నిమిత్తం గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి రైతులకు ప్రభుత్వం రూ.260 చొప్పున ఇస్తుందని, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ పనులేమీ చేయించకుండా సొమ్ము స్వాహా చేశాడని ఆరోపించారు. గృహనిర్మాణాలు చేపట్టేవారికి ఇచ్చే నగదు కూడా వేరే వాళ్ల ఖాతాల్లో వేయించి కాజేయడమేకాక, ఆడిట్‌లో కూడా తప్పులే వచ్చాయని, రూ.19 లక్షలు రికవరీ ఆడిట్‌లో చూపించారని, దీనిపై కూడా స్పందన లేదన్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ అధికారులకు ఫిర్యాదు అందించారు.

రాజమహేంద్రవరం గ్రామీణం
• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

వెంకటాపురంలో వైద్య శిబిరం

రంగంపేట: రంగంపేట మండలం వెంకటాపురంలో సోమవారం డెల్టా ఆసుపత్రి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సర్పంచి ముంగి గంగరాజు ప్రారంభించారు. మధుమేహం, రక్తపోటు తదితర ఆరోగ్య సమస్యలున్న వారిని పరీక్షించి.. ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

సినిమాలు

దానవాయిపేట: రాజా, వీఎస్ మహల్, అశోక, కుమారి, సూర్యప్యాలస్, అప్సర: **దేవర,** స్వామి, అనుశ్రీ: **స్వాగ్,** శ్యామల: **35 చిన్నకథకాదు,** సూర్యమినీ: **దక్షిణ,** శివజ్యోతి: **రామ్‌నగర్ బన్నీ,** రంభ: **కమిటీ కుర్రోళ్లు,** ఊర్వశి: **సత్యం సుందరం,** మేనక: **మత్తు వదలరా-2, మిస్టర్ సెలబ్రిటీ(రెండు ఆటలు).**

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం


దాతకు స్వామివారి జ్ఞాపిక అందజేస్తున్న పర్యవేక్షకుడు శ్రీనివాస్

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద చేపట్టిన వకుళమాత నిత్యాన్నదాన భవన నిర్మాణానికి రాజమహేంద్రవరం మండలం బొమ్మూరుకు చెందిన మత్స్యేటి శివ, సత్యవతి దంపతులు రూ.50 వేల విరాళాన్ని సోమవారం అందజేశారు. వీరికి స్వామివారి జ్ఞాపిక అందించి దేవస్థానం పర్యవేక్షకుడు రాపాక శ్రీనివాస్ అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సిమెంట్ బల్ల విరిగింది



సమస్య: కడియం దేవి సెంటర్‌లో కొత్తవంతెనపై పుట్‌పాత్‌లో విరిగిన సిమెంట్ బల్లతో చాలా అవస్థలు పడుతున్నాం. వెంటనే సమస్య పరిష్కరించండి.

- బడిగంటి పోసిబాబు, కడియం

సమాధానం: ఇప్పటివరకూ ఎలాంటి ఫిర్యాదు అందలేదు. క్షేత్రస్థాయిలో చూసి సమస్యను పరిష్కరిస్తాం

- సత్యనారాయణ, ఏఈ, ర.భ.శాఖ

గుంతలతో ఇబ్బందులు



సమస్య: కడియం జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలోని రహదారిపై ఉన్న గుంతలతో విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాటిని మూయించాలి.

- ఎన్.శేఖర్, ప్రైవేటు ఉద్యోగి

సమాధానం: రహదారిపై గుంతలను పూడ్చేందుకు ప్రతిపాదనలు పంపించాం. అనుమతులు రాగానే పనులు ప్రారంభిస్తాం.

- సత్యనారాయణ, ఏఈ – న్యూస్‌టుడే, కడియం

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: **91212 29057,** కడియం: **91212 29062,** అనపర్తి: **91000 20947**

సంపద సృష్టితో ఆదాయం.. ఆరోగ్యం!

- **ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలపై నిర్లిప్తత**
- **గాంధీ జయంతి నాటికీ వినియోగమేదీ?**

సీతానగరం, న్యూస్‌టుడే: స్వచ్ఛతా హీ సేవ, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ పేరుతో నగరాలు, గ్రామీణ ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నా పలు ప్రాంతాల్లో సక్రమంగా అమలు కావడం లేదు. దీంతో రహదారుల పక్కన, చెత్తకుండీల వద్ద వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోతున్నాయి. దోమలు, ఈగలు వృద్ధి చెందడంతో ప్రజలు తరచూ అనారోగ్యం బారిన పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వ్యర్థాలు కుళ్లడంతో తీవ్ర దుర్వాసన వస్తోందని పలు పంచాయతీల్లో ప్రజలు వాపోతున్నారు.

దృష్టి పెడితే ఉపయోగం

2014-19 మధ్యకాలంలో తెదేపా పాలనలో నిర్మించిన సంపద సృష్టి కేంద్రాలను వైకాపా పూర్తిగా నిర్వీర్యం చేసేసింది. అప్పటివరకు ఎంతో కొంత ఎరువు తయారు చేసి గ్రామ పంచాయతీలు అదనపు ఆదాయం పొందేవి. వీటిని మూసివేయడంతో పూర్తిగా శిథిలస్థితికి చేరే పరిస్థితి ఏర్పడింది. వీటిని వినియోగంలోకి తెచ్చేందుకు కూటమి ప్రభుత్వం దృష్టి సారించి.. అక్టోబరు 2 నాటికి అన్నిచోట్లా నిర్వహణలోకి రావాలని ఆదేశించినా పలుచోట్ల పట్టాలెక్కలేదు. డివిజన్ పరిధిలోని 147 పంచాయతీల్లో 121 సంపద సృష్టి కేంద్రాలు ఉంటే అందులో తొలివిడతగా 100 పని చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు. గత ఐదేళ్ల పాలనలో పూర్తిగా నిర్వీర్యం చేయడంతో పట్టాలెక్కించడం ప్రహసనంగా తయారైందన్నది క్షేత్ర స్థాయిలో అర్థమవుతోంది.


చినకొండేపూడిలో నిరుపయోగంగా సంపద సృష్టి కేంద్రం

15 రోజుల వ్యవధిలో..

సంపద సృష్టి కేంద్రాలను వినియోగంలోకి తెచ్చేలా అవసరమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతున్నాం. చాలాచోట్ల కేంద్రాలను వాడకుండా వదిలేయడంతో పాడైపోవడం వల్ల మరమ్మతులు చేసేందుకు సమయం పడుతూ గాంధీ జయంతి నాటికి లక్ష్యం నెరవేరలేదు. డంపింగ్ యార్డుల సమస్య తీర్చేలా రెవెన్యూ యంత్రాంగంతో కలిసి అవసరమైన స్థల సేకరణ చేయిస్తాం. 15 రోజుల్లో వినియోగంలోకి తెచ్చే దిశగా పనిచేస్తున్నాం.

- బి.శ్రీనివాస్, డీపీవో, రాజమహేంద్రవరం

డివిజన్ పరిధిలో ఇలా..

నియోజకవర్గం	గ్రామ పంచాయతీలు	సంపద సృష్టి కేంద్రాలు	హరిత రాయబారులు
అనపర్తి	41	34	221
రాజానగరం	71	54	215
రాజమహేంద్రవరం గ్రామీణం	21	19	211
గోకవరం (మండలం)	14	14	61

మచ్చుకు కొన్ని...

- సీతానగరం మండలంలో 16 సంపద సృష్టి కేంద్రాలు ఉంటే అందులో సీతానగరం, బొబ్బిల్లంక కేంద్రాలే పనిచేస్తున్నాయి. 11 చోట్ల కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.12,500 విలువ కలిగిన వానపాములను తీసుకొచ్చి వేశారు. రఘుదేవపురం పంచాయతీలో డంపింగ్‌యార్డు సమస్య ఇప్పటికీ ఒక కొలిక్కిరాలేదు.
- కోరుకొండ మండలంలో 19 కేంద్రాలకుగాను 8 పనిచేస్తున్నట్లు చూపిస్తున్నారే తప్ప ఎరువు తయారీ చేసి ఆదాయ వనరుగా చూపించలేకపోయారు. మరో మూడుచోట్ల స్థలం లేదనే కారణంతో పక్కన పెట్టేశారు.
- అనపర్తిలో 41 గ్రామ పంచాయతీల్లో 34 సంపద సృష్టి కేంద్రాలు ఉంటే అందులో మూడొంతులకు పైగా వినియోగంలోకి రావడం లేదు.


శిక్షణలో సభ్యులకు ఆటవిడుపు

పరిపాలన విధానంపై అవగాహన అవసరం

రంగంపేట: పల్లెల అభివృద్ధి కోసం గ్రామస్థాయి ప్రజాప్రతినిధులకు వారి విధులు, హక్కులపై అవగాహన తప్పనిసరి అని ఎంపీడీవో వి.వి.సాయిబాబు తెలిపారు. సోమవారం రంగంపేట మండల పరిషత్ కార్యాలయంలో ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు జరిగాయి.

బిక్కవోలు: ఉప సర్పంచులకు, ప్రతి పంచాయతీ నుంచి ఇద్దరు మహిళా సభ్యులకు సోమవారం శిక్షణ నిర్వహించారు. పందలపాక డిజిటల్ అసిస్టెంట్ సురేష్, ఇంఛార్జి ఎంపీడీవో రత్నకుమార్ శిక్షణ ఇచ్చారు.

రాజానగరం: గ్రామ ఉపసర్పంచులకు విధివిధానాలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ జె.ఏ.ఝాన్సీ తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.

సీతానగరం: గ్రామపంచాయతీల్లోని ఉప సర్పంచులకు, ఇద్దరేసి పాలకవర్గ సభ్యులకు సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం శిక్షణ తరగతులు నిర్వహించారు.

కోరుకొండ: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ నిర్వహణపై రెండు రోజుల శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. ఎంపీడీవో అశోక్‌కుమార్, ఈవోపీఆర్డీ ప్రతాప్ పాల్గొన్నారు.

బాలలతో పనులు చేయిస్తే కఠిన చర్యలు

పాడేరు, న్యూస్‌టుడే: బాలలతో పనులు చేయించుకుంటే కఠిన చర్యలు చేపడతామని ఐటీడీఏ పీఓ వి.అభిషేక్ హెచ్చరించారు. హుకుంపేట మండలం దొంతురాయి గ్రామానికి చెందిన కాకరి ప్రమీల కుమార్తె మోహితదేవి(9)ని రాజమహేంద్రవరం తరలించి ఇంట్లో పనులు చేయిస్తున్న ఇదే గ్రామానికి చెందిన శెట్టి మనోహర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బాలికను వెంటబెట్టుకుని ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో పీవోను కలిశారు. అనంతరం పీడీ వివరాలు తెలిపారు. మోహితదేవి దొంతురాయి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. రెండు నెలల క్రితం మనోహర్ తన పిల్లలతో పాటు మోహితదేవిని రాజమహేంద్రవరం తీసుకెళ్లి. . తన ఇంట్లో వెట్టిచాకిరీ చేయించసాగారు. ఎలాగో బాలిక తప్పించుకుని గోదావరి వంతెనపై నడిచి వెళ్తుండగా ఓ వ్యక్తి గమనించి పోలీసులకు అప్పగించారు. వారి సమాచారం మేరకు రంపచోడవరం సీడీపీఓ సంధ్యారాణి, అడ్డతీగల సీడీపీఓ సుధలను రాజమహేంద్రవరం పంపించారు. సీడీపీఓలు బాలికను పాడేరు తీసుకొచ్చి ఐసీడీఎస్ పీడీకి శనివారం అప్పగించారు. బాలికను బాలల సదనంలో చేర్పించాలని పీవో సూచించారు. బాలకార్మిక నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. రెండు నెలలుగా బాలిక పాఠశాలకు గైర్హాజరైనా పట్టించుకోని దొంతురాయి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని డీఈఓ బ్రహ్మాజీరావుకు సూచించారు. రెండు రోజులపాటు విద్యార్థులు పాఠశాలలకు రాకపోతే వెంటనే సమాచారం తెలుసుకుని ఉన్నతాధికారులకు తెలియజేయాలని.. ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సర్క్యులర్ జారీ చేయాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి డీడీ రజని, డీఈఓ బ్రహ్మాజీరావు తదితరులు పాల్గొన్నారు.


వ్యవసాయ పంచాంగాలను, పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అధికారులు

ప్రకృతి, సేంద్రియ పద్ధతులతో సత్ఫలితాలు

హుకుంపేట, న్యూస్‌టుడే: హుకుంపేట పంచాయతీ రైతుభరోసా కేంద్రంలో సోమవారం వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు హాజరై పంటకు కావలసిన ముఖ్య పోషకాల గురించి రైతులకు వివరించారు. శాస్త్రవేత్తలు సీహెచ్.నరసింహారావు, ఎం.శ్రీనివాస్ మాట్లాడుతూ.. వరిలో సమగ్ర సస్యరక్షణ, విత్తనం ఎంపిక తదితరాలను వివరించారు. గ్రామీణ వ్యవసాయ సంచాలకులు డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ప్రకృతి, సేంద్రియ విధానాలను అవలంబించడం ద్వారా పంట దిగుబడిని పెంచుకోవచ్చన్నారు.

శెట్టిబలిజల అభ్యున్నతే లక్ష్యం

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: స్థానిక లూథరన్ ఉన్నత పాఠశాలలో సోమవారం శెట్టిబలిజ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా బత్తెన సత్యసూర్యప్రసాద్, కార్యదర్శిగా దొమ్మేటి రవికుమార్, కోశాధికారిగా కొప్పిశెట్టి వెంకటరావు తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శెట్టిబలిజ కులస్థుల అభ్యున్నతికి సంఘం పాటుపడుతుందన్నారు. నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఉప కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు ఇతర సభ్యులు ప్రమాణాలు చేశారు.

కడియం ఎంపీడీవోగా రమేశ్

కడియం, న్యూస్‌టుడే: కడియం మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారిగా కె.రమేశ్ సోమవారం ఉదయం బాధ్యతలను స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన సీతానగరం మండలం నుంచి ఇక్కడికి వచ్చారు. పూర్వపు ఎంపీడీవో కె.రత్నకుమారి ఇక్కడి నుంచి కపిలేశ్వరపురంకు బదిలీపై వెళ్లారు. ఆ సందర్భంగా నూతన ఎంపీడీవో కె.రమేశ్‌కు సిబ్బంది పుష్పగుచ్ఛాలు, మొక్క అందించి స్వాగతం పలికారు.



రిక్షాలకు రక్షణ లేదు

శౌటిలైట్‌సిటీ పంచాయతీలో కొద్ది నెలలుగా స్వచ్ఛ శుభ్రత రిక్షాలు మూలకు చేరాయి. వర్షాలకు తడిచి, ఎండకు తుప్పుపట్టాయి. ట్రాక్టర్ కూడా తుప్పు పట్టి అధ్వానంగా ఉంది. ప్రజాధనం వృథా అవుతుందని స్థానికులు అంటున్నారు. కార్యదర్శి కృష్ణను వివరణ కోరగా రిక్షాలకు మరమ్మతులు చేసి వినియోగిస్తామని తెలిపారు.

-న్యూస్‌టుడే, బొమ్మూరు

అమ్మదయతో రాష్ట్రాభివృద్ధి: మంత్రి దుర్గేశ్


కడియంలో అమ్మవారికి మంత్రి దుర్గేశ్, ఎమ్మెల్యే గోరంట్ల పూజలు

కడియం: కడియం, దామిరెడ్డిపల్లిలోని పలు ఆలయాల్లో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి పూజల్లో సోమవారం మంత్రి దుర్గేశ్‌తో పాటు ఎమ్మెల్యే గోరంట్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి అమ్మ దయ ఉండాలని కోరుకున్నారు. ప్రజలంతా సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. కడియం శ్రీదేవి ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు వారిని జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.

వైభవంగా పడిపూజ


భవానీ పడిపూజలో ఆకట్టుకుంటోన్న అలంకరణ

సావిత్రినగర్ (హుకుంపేట): 'జై భవానీ..' అంటూ భక్తుల జగన్మాత స్మరణతో హుకుంపేట సావిత్రినగర్ ప్రాంతం పులకించిపోయింది. దేవీ శరన్నవరాత్రులు పురస్కరించుకుని అల్లూరి నరసింహారావు ఆధ్వర్యంలో కాలనీవాసులు సోమవారం భవానీ పడిపూజను ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించిన మండపంలో కనకదుర్గమ్మ చిత్రపటాన్ని కొలువుదీర్చి పూజలు చేశారు. మండపంపై రూపొందించిన శివలింగం, త్రిశూలం ఆకృతులు ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులు భజన కార్యక్రమాలు చేపట్టారు.

భక్తులకు ఉచిత వడి, భిక్ష

దివాన్‌చెరువు, (రాజానగరం): విజయవాడకు పాదయాత్రగా వెళ్తున్న భవానీ భక్తులకు దివాన్‌చెరువులో జాతీయ రహదారిపై జీరోపాయింట్ వద్ద ఉచిత వడి, భిక్ష సోమవారం ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరానికి చెందిన సాయితేజ గార్మెంట్స్ అధినేత భవానీసింగ్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఫ్రూట్ మార్కెట్ నిర్వాహకులు సైతం ఈ సౌకర్యాన్ని కల్పించారు.

సీతానగరం ఏపీఎంగా జిలానీ

సీతానగరం, న్యూస్‌టుడే: మండల మహిళా సమాఖ్య సీతానగరం డీఆర్‌డీఏ-సెర్ప్ ఏపీఎంగా ఎండీ జిలానీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆయన అనపర్తి మండలంలో పనిచేశారు. సీతానగరం ఏపీఎంగా ఇంతవరకు బాధ్యతలు నిర్వహించిన ఇ.మహాలక్ష్మి నిడదవోలు బదిలీ అయ్యారు.

ధవళేశ్వరంలో డీఎస్పీ తనిఖీ

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: సాధారణ తనిఖీలలో భాగంగా రాజమహేంద్రవరం దక్షిణ మండల డీఎస్పీ భవ్యకిషోర్ సోమవారం సాయంత్రం ధవళేశ్వరం పోలీస్‌స్టేషన్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని సిబ్బందికి సూచించారు. రౌడీషీటర్ల కదలికలను గమనించాలన్నారు. దీపావళి సందర్భంగా మందుగుండు అక్రమ నిల్వలపై తనిఖీలు నిర్వహించి అనుమతులు లేని వారిపై కేసులు నమోదు చేయాలని సీఐ గణేష్‌ని ఆదేశించారు.

అక్రమంగా నిల్వ చేస్తే కఠినచర్యలు

ధవళేశ్వరం: దీపావళి సందర్భంగా వ్యాపారులు ముందస్తు అనుమతులు తీసుకోకుండా మందుగుండు తయారుచేసినా, నిల్వఉంచినా కఠిన చర్యలు తీసుకుంటామని ధవళేశ్వరం సీఐ టి.గణేష్ హెచ్చరించారు. వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా లైసెన్సులు తీసుకోవాలన్నారు. తనిఖీల సమయంలో అనుమతి పత్రాలు తప్పక చూపాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. దసరా సెలవుల నేపథ్యంలో ఇంటి తాళం వేసి దూరప్రాంతాలలో బంధువుల ఇళ్లకు వెళ్లే వారు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందిస్తే.. ఇంటికి సీసీ కెమెరా ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తామని సీఐ తెలిపారు.


రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ భవ్యకిషోర్

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

రాజానగరం, న్యూస్‌టుడే: ఎన్‌సీసీలో చేరి శిక్షణ పొందడం ద్వారా క్రమశిక్షణతో పాటు దేశ సమైక్యత, సమగ్రతలపై విద్యార్థులలో గట్టి పునాది ఏర్పడుతుందని మేజర్, డిప్యూటీ క్యాంప్ కమాండర్ అసిఫ్ సాహెబ్ అన్నారు. ఎన్‌సీసీ ప్రత్యేక జాతీయ సమైక్యత శిబిరంలో సోమవారం క్యాడెట్లకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. తమ సంస్కృతి, సంప్రదాయాలను తెలియపరిచేలా వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు జరిగాయి.

ఇంద్రకీలాద్రిలో మొక్కల పంపిణీ

ఇంద్రకీలాద్రి: దసరా వేడుకల్లో దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భక్తులకు ఓ రైతు తులసి, ఉసిరి తదితర మొక్కలు పంచారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కడియం ప్రాంతానికి చెందిన ఓ నర్సరీ యజమాని ఇంద్రకీలాద్రిపై భక్తులకు మొక్కలు పంచాలనుకున్నారు. ఈ మేరకు ఆయన దుర్గమ్మ ఆలయ ఈవో రామారావును కలిసి ఈ మొక్కల గురించి వివరించారు. ఆయన అంగీకారంతో సదరు రైతు లారీలో మొక్కలు తీసుకువచ్చి భక్తులకు అందజేశారు.

అమ్మా భవానీ.. నమో శర్వాణీ..


హుకుంపేట ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయంలో లలితా దేవిగా..

సీతానగరం:, బొమ్మూరు, హుకుంపేట, బిక్కవోలు, కడియం: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా ఊరూరా అమ్మవారికి విశేష అలంకరణలు చేస్తున్నారు. ఆ క్రమంలోనే సోమవారం సీతానగరంలోని వెలంపేట రామాలయం వద్ద ప్రతిష్ఠించిన దుర్గాదేవికి ఊరంతా కలిసి రూ.లక్ష విలువ చేసే సారెను బహూకరించారు. 89 రకాల పిండి వంటలు, చీరలు, గాజులు, పూలు, పండ్లు అందులో ఉన్నాయి. ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాల మాదిరి ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరారు. బొమ్మూరు నేతాజీనగర్‌లోని కనకదుర్గ ఆలయంలో మహాలక్ష్మిగా అలంకరించారు. ఉదయం అమ్మవారి చుట్టూ కరెన్సీ నోట్లతో అలంకరణ చేశారు. మంగళవారం సరస్వతి రూపంలో దర్శనం, చిన్నారులతో సరస్వతిపూజ ఉంటుంది. హుకుంపేట ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో లలితాదేవిగా.. బిక్కవోలు శ్రీగోలింగేశ్వర స్వామి ఆలయంలో మహా చండీగా కనువిందు చేశారు. కొంకుదురు శ్రీగోపాల రామానాయుడు వీధిలోని అమ్మవారికి సోమవారం ఘనంగా ఘటాభిషేకం జరిగింది. భారీగా మహిళలు ఘటాలతో గోదావరి కాలువకు వెళ్లి నీటిని తెచ్చి అభిషేకించారు. పండితులు రమణశర్మ, భాస్కర శర్మల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.


బొమ్మూరులో లక్ష్మీదేవిగా..


బిక్కవోలు: ఘటాలతో ఊరేగింపు


మహాచండీగా పార్వతీదేవి


కడియపులంకలో...


సీతానగరం: అమ్మవారికి ఊరంతా కలిసి సారె తీసుకెళుతూ..

కరాటే విజేతలను అభినందించిన ఎస్పీ


పతకాలు సాధించిన కరాటే విద్యార్థులతో ఎస్పీ నరసింహకిషోర్

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో ధవళేశ్వరం, రాజమహేంద్రవరం విద్యార్థులు ప్రతిభ కనబరచి పతకాలు సాధించారు. వారిని జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ అభినందించారు. కటాస్, స్పారింగ్‌లోని వివిధ విభాగాలలో బి.అక్షయ, బి.అంజలి, నవ్యశ్రీ, శశాంక్, ప్రసన్నపూజిత, పూజ, ఆయేషా, శ్రీలక్ష్మీలత, చరణ్, వైష్ణవి తదితరులు బంగారు, వెండి, రజత పతకాలు సాధించారు. వారికి ఎస్పీ చేతుల మీద ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కరాటే శిక్షకులు పిల్లి అరుణ్‌కుమార్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కార్యాచరణ ప్రణాళిక

దివాన్‌చెరువు (రాజానగరం), న్యూస్‌టుడే: పదోతరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కార్యాచరణ రూపొందించామని. . ఈ మేరకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని డీఎస్‌డీఓ కె.వాసుదేవరావు అన్నారు. దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో భాగంగా అన్ని పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయించామన్నారు. వార్షిక విద్యా క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేసేలా చూస్తున్నామన్నారు. విద్యార్థినులకు ఉపాధ్యాయులు కనీసం ఐదారు అడుగుల దూరం పాటించి విద్యాబోధన చేయాలని.. ముఖ్యంగా ఉపాధ్యాయులు విద్యార్థినులతో వ్యక్తిగతంగా మాట్లాడవద్దని సూచించారు.

ఉపాధి అవకతవకలపై విచారణకు డిమాండ్

వి.ఎల్.పురం: ఉపాధి హామీ పథకంలో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని గోకవరం మండలం ఎదురుపాక గ్రామానికి చెందిన పలువురు డిమాండ్ చేశారు. ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ పాల్పడిన అవకతవకలపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు గ్రామస్థులు పలువురు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పామాయిల్ తోటల నిర్వహణ నిమిత్తం గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి రైతులకు ప్రభుత్వం రూ.260 చొప్పున ఇస్తుందని, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ పనులేమీ చేయించకుండా సొమ్ము స్వాహా చేశాడని ఆరోపించారు. గృహనిర్మాణాలు చేపట్టే వారికి ఇచ్చే నగదు కూడా వేరే వాళ్ల ఖాతాల్లో వేయించి కాజేయడమే కాక, ఆడిట్‌లో కూడా తప్పులే వచ్చాయని, రూ.19 లక్షలు రికవరీ ఆడిట్‌లో చూపించారని, దీనిపై కూడా స్పందన లేదన్నారు. విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతూ అధికారులకు ఫిర్యాదు అందించారు.

గోపాలమిత్రల గోడు విన్నారు!

వ్యవస్థను పట్టాలెక్కించేందుకు కూటమి సర్కారు యత్నం

అనపర్తి పట్టణం, బిక్కవోలు, న్యూస్‌టుడే: పశుసంవర్ధకశాఖలో గోపాలమిత్రల ప్రాధాన్యం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు ఎనలేని సేవలు అందించారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వారికి ప్రాధాన్యత తగ్గింది. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో రెండు, మూడు గ్రామాలకు కలిపి ఒక పశుసంవర్ధక సహాయకుణ్ని నియమించారు. తద్వారా గోపాలమిత్రల ప్రాభవం తగ్గినట్లయింది. కొత్తగా ఉద్యోగంలో చేరిన వారికి అనుభవం లేదు. అనుభవం ఉన్న గోపాలమిత్రులకు పని లేదు అన్న చందాన పరిస్థితి మారింది. కనీసం వారికి సక్రమంగా జీతాలు కూడా రాని దుస్థితి. ప్రస్తుతం ఈ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.


వైద్య సేవలు అందిస్తున్న గోపాలమిత్ర

ఇదీ పరిస్థితి..

గోపాలమిత్రల వ్యవస్థకు తిరిగి జవసత్వాలు అందించే దిశగా ప్రస్తుతం సర్కారు కసరత్తు చేస్తోంది. తద్వారా పాడి రైతులకు వారిని అండగా నిలిపే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇప్పటివరకు గోపాలమిత్రలకు నెలజీతం కేవలం రూ.6,500 వస్తుండగా.. అదీ సక్రమంగా అందని దుస్థితి. వైకాపా ప్రభుత్వం పశుసంవర్ధక సహాయకులను సచివాలయాల్లో నియమించడంతో వీరి పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. కొందరు గోపాలమిత్రలు సహాయకులుగా ఉద్యోగాలు సాధించినా.. ఇంకా అనేక మంది అటుఇటు కాకుండా మిగిలారు. అలా రాజమహేంద్రవరం డివిజన్‌లో 24 మంది పని చేస్తుండగా.. ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయంతో వారికి మంచి జరిగే అవకాశం కనిపిస్తోంది.

ప్రభుత్వం దృష్టి పెట్టింది

ప్రస్తుతం గోపాలమిత్రల వ్యవస్థను గాడిలో పెట్టే పని కూటమి ప్రభుత్వం చేపట్టింది. వారిని కొనసాగిస్తూ అందరికీ పని కల్పించే చర్యలు చేపట్టింది. బకాయి ఉన్న జీతాలు జులై నెల వరకు చెల్లించింది.

- డా.ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ డైరెక్టర్, పశుసంవర్ధకశాఖ, రాజమహేంద్రవరం డివిజన్

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

సంపత్‌నగరం (రాజానగరం): సంపత్‌నగరం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో ఈ మంగళ, గురువారాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, గురువారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపేస్తున్నామన్నారు. ఫలితంగా కొండగుంటూరు, నామవరం, పుణ్యక్షేత్రం, భూపాలపట్నం, కె.తుంగపాడు, పి.తుంగపాడు, జి.యర్రంపాలెం గ్రామాల్లో సేవలకు అంతరాయం కలుగుతుందని వివరించారు.

చికిత్స పొందుతూ యాచకుడి మృతి

రాజమహేంద్రవరం నేరవార్తలు: లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీ సమీపంలోని జాతీయ రహదారి దాటుతున్న ఓ 65 ఏళ్ల యాచకుడిని గత నెల 28న రాత్రి ఆర్టీసీ బస్సు ఢీ కొంది. ఆ ప్రమాదంలో గాయపడిన యాచకుడు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లుగా ఆసుపత్రి వర్గాలు బొమ్మూరు పోలీసులకు సమాచారం ఇచ్చాయి. యాచకుడి వివరాలు తెలియరాలేదని, వీఆర్వో రామజోగి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రియకుమార్ తెలిపారు.

కొవ్వూరు

•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

ప్రత్యేక సహస్రనామ పూజలు

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో దసరా వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం కోటసత్తెమ్మ అమ్మవారు బంగారం, ప్రత్యేక పూల అలంకరణతో దర్శనమిచ్చారు. 280 మంది దంపతులు ప్రత్యేక సహస్రనామ కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు నిడదవోలుకు చెందిన కొత్త త్రిమూర్తులు జ్ఞాపకార్థం కుమారుడు కొత్త తులసిరామకృష్ణ దంపతులు పొంగలి ప్రసాదాన్ని అందించారు. అమ్మవారికి రూ.1,37,970 ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దేవులపల్లి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా ర్యాలీ

చాగల్లు: మార్కొండపాడు సెయింట్ పీటర్స్ లూథరన్ చర్చిలో సోమవారం స్త్రీల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. పాస్టర్ ఎం.జయపాల్, జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చిన్నారులు, మహిళలు పాల్గొని క్రీస్తు సంకీర్తనలు, బైబిల్ వాక్యాలను గ్రామస్థులకు వినిపించారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఈవోపీఆర్డీగా రాజారావు

దేవరపల్లి: దేవరపల్లి మండల ఈవోపీఆర్డీగా వై.రాజారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఏలూరు జిల్లా కలిదిండి నుంచి సాధారణ బదిలీల్లో ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు పని చేసిన పి.ప్రభాకరరావు ఎన్టీఆర్ జిల్లా వెళ్లారు. రాజారావును మండలంలోని పంచాయతీ కార్యదర్శులు కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమస్య: ఉండ్రాజవరం పరిధిలో ప్రధాన డ్రెయిన్లో తూడు అలముకుంది. మురుగు నీటి ప్రవాహానికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. - కె.రాము, ఉండ్రాజవరం

సమాధానం: మురుగు కాలువను పరిశీలించి తూడు తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. - ఎం.వెంకటేశ్వరరావు, డ్రెయిన్స్ ఏఈ

- న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

సమస్య: అయ్యవరం ప్రధాన రహదారి పక్కన చెత్తా చెదారం వేస్తున్నారు. దాని నుంచి దుర్వాసన వస్తుండటంతో పరిసరాల్లోని నివాసితులు, అటుగా వెళ్లేవారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - రాము, స్థానికుడు

సమాధానం: పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం.

- న్యూస్‌టుడే, నల్లజర్ల - గుడిసే వీరస్వామి, సర్పంచి

సమస్య: జాన్‌పేటలోని డ్రెయిన్లో వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగు నిలిచిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. దుర్వాసన భరించలేకుండా ఉన్నాం. దోమల బెడదా పెరిగిపోయింది. - స్థానికుడు, అన్నదేవరపేట

సమాధానం: డ్రెయిన్లను శుభ్రం చేయించి సమస్య పరిష్కరిస్తాం.

- న్యూస్‌టుడే, తాళ్లపూడి - వీరన్న, పంచాయతీ కార్యదర్శి

పాదులు తొలగించారు..



స్పందనకు వందనం

దేవరపల్లి మండలం సుబ్బరాయపురంలోని ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న విద్యుత్తు స్తంభానికి పాదులు అల్లుకుని ప్రమాదకరంగా మారింది. దీనిపై 'అధికారుల నిర్లక్ష్యం' శీర్షికన సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన సమస్యపై సంబంధిత ఏఈ సీహెచ్.వెంకట్రావు స్పందించారు. సిబ్బందితో పాదులు తొలగింపజేశారు. సమస్య పరిష్కారం కావడంతో పరిసరాల్లోని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

- న్యూస్‌టుడే, దేవరపల్లి

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కొవ్వూరు: **80085 74497** నిడదవోలు: **80085 74501**, గోపాలపురం: **91212 29084**

యాదవోలు రోడ్డు శుభ్రం

ఈనాడు కథనానికి స్పందన

దేవరపల్లి, న్యూస్‌టుడే: దేవరపల్లిలోని యాదవోలు వెళ్లే రహదారిలో వ్యర్థాల తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. మండలంలోని ప్రధాన రహదారులు వ్యర్థాలతో నిండిపోవడంతో ప్రజలు, వాహనచోదకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 'రహదారులపై వ్యర్థాలు.. పట్టించుకోని అధికారులు' శీర్షికన సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై దేవరపల్లి పంచాయతీ కార్యదర్శి నిట్టా రవికిషోర్ స్పందించారు. జేసీబీ సహాయంతో వ్యర్థాల తొలగింపునకు చర్యలు చేపట్టారు.

గంజాయి రవాణా నియంత్రణకు నిఘా కట్టుదిట్టం



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎస్పీ దేవకుమార్

తాళ్లపూడి: ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ శాంతిభద్రతలను పర్యవేక్షించాలని కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ సిబ్బందికి సూచించారు. తాళ్లపూడి పోలీసు స్టేషన్‌కు ఆయన సోమవారం విచ్చేశారు. పలు కేసులకు సంబంధించిన దస్త్రాలను పరిశీలించారు. అంతకుముందు సిబ్బందితో సమావేశమై పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని, చోరీలు జరగకుండా, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలని సూచించారు. గంజాయి రవాణాకు అడుకట్ట వేసేందుకు నిఘా కట్టుదిట్టం చేయాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, యువత పక్కదారి పట్టకుండా అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఆయన వెంట కొవ్వూరు సీఐ విజయబాబు ఉన్నారు.

వేలివెన్నులో నాగలి సెట్లు చోరీ

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: ట్రాక్టర్‌తో దుక్కు దున్నే ఇనుప నాగలి సెట్లు చోరీకి గురైనట్లు వేలివెన్నుకు చెందిన టేకు వీరభద్రుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసుతు తెలిపారు. కాగా వారం రోజుల వ్యవధిలో గ్రామంలో వ్యవసాయ విద్యుత్తు తీగలు, ట్రాక్టర్ బ్యాటరీలు చోరీకి గురి కావటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

విభాగినిని ఢీకొన్న కారు: ఒకరికి గాయాలు


నల్లజర్ల, న్యూస్‌టుడే: నల్లజర్లకు చెందిన కళ్లెం దుర్గాప్రసాద్ సోమవారం రాత్రి ఏలూరు నుంచి స్వగ్రామానికి కారులో వస్తుండగా ఘంటావారిగూడెం వద్ద వాహనం అదుపుతప్పి విభాగినిని ఢీకొని అటుగా వచ్చే రహదారిపై పడింది. ఈ ఘటనలో దుర్గాప్రసాద్ తలకు తీవ్ర గాయం కావడంతో హైవే పోలీసులు అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

సొసైటీలో చోరీ: నిందితుడి అరెస్టు

చాగల్లు, కొవ్వూరు పట్టణం: దొమ్మేరు సొసైటీలో ఈ నెల 6న నగదు, కంప్యూటర్ మోడెమ్‌తోపాటు ఇతర సామగ్రి చోరీకి గురయ్యాయి. పట్టణ సీఐ విశ్వం ఆధ్వర్యంలో నిర్వహించిన దర్యాప్తులో ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం పెదగొన్నూరుకు చెందిన గుబ్బిలి సుబ్రహ్మణ్యం చోరీకి పాల్పడినట్లు గుర్తించి సోమవారం అదుపులోకి తీసుకున్నారు. రూ.5 వేలు నగదు స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై జగన్మోహనరావు తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న 29 ఎద్దులు స్వాధీనం

చాగల్లు, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా ఎద్దులను తరలిస్తున్న లారీని పట్టణ పోలీసులు స్వాధీన పరుచుకున్నారు. సీఐ పి.విశ్వం తెలిపిన వివరాల ప్రకారం జగ్గంపేట నుంచి హనుమాన్ జంక్షన్‌కు 29 ఎద్దులతో వెళుతున్న లారీని సోమవారం తనిఖీల్లో గుర్తించామన్నారు. ఇందుకు సంబంధించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఎద్దులను గోశాలకు తరలించనున్నట్లు సీఐ తెలిపారు.



అలంకరణలో కోటసత్తెమ్మ



తాళ్లపూడి: మహాచండీదేవిగా..



ఉండ్రాజవరంలో..



పాలంగిలో..



కవులూరులో పోలేరమ్మతల్లి



దేవరపల్లిలో శ్రీ బాలదుర్గమ్మ



దేవరపల్లి మూడు బొమ్మల సెంటర్‌లో చండీ హోమం

చండీదేవి.. నమోస్తుతే

దేవీ నవరాత్రి మహోత్సవాల్లో అయిదో రోజైన సోమవారం అమ్మవారిని మహాచండీదేవిగా అలంకరించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో హోమాలు, అభిషేకాలు, వేద పారాయణాలు, మహిళలు కుంకుమ పూజలు చేశారు. * కొవ్వూరు, చాగల్లు, మండల గ్రామాల్లో దసరా వేడుకలు అంబరాన్నంటుతున్నాయి. కొవ్వూరు మండలం వాడపల్లి గ్రామంలోని కళాకారుల శక్తి నృత్యాలు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి. * తాళ్లపూడిలోని రాజ్యలక్ష్మి, మలకపల్లిలో కనకదుర్గాదేవి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేగేశ్వరపురం, బల్లిపాడు, పెద్దేవం, అన్నదేవరపేట, తాడిపూడి తదితర గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాల వద్ద పూజలు చేశారు. * పెరవలి మండలంలోని కాపవరం, కాకరపర్రు, తీపర్రు, కానూరు, ఉసులుమర్రు, మల్లేశ్వరం పిట్టలవేమవరంలో దేవీ నవరాత్రులు వైభవంగా నిర్వహిస్తున్నారు. * ఉండ్రాజవరం మండలం పాలంగిలో దుర్గాదేవి ఆలయం వద్ద చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముత్యాలమ్మతల్లికి విశేష అలంకరణ పూజలు చేశారు. పాలంగిలో రామలింగేశ్వరస్వామి ఆలయంలో బాలాత్రిపురసుందరిదేవికి చండీమాతగా అలంకరించారు. * దేవరపల్లిలోని మూడు బొమ్మల సెంటర్‌లో చండీహోమం నిర్వహించారు. పల్లపు వీధి రామాలయం, శ్రీ బాలదుర్గమ్మ, నిమ్మలపాటి దిబ్బ ప్రాంతాల్లో ప్రత్యేక పూజలు చేశారు. * ఆవపాడులోని విజయదుర్గ తల్లి ఆలయంలో అఖండ జ్యోతిని గ్రామస్థులు వెలిగించారు.

- న్యూస్‌టుడే బృందం



చాగల్లులో శక్తి వేషధారణలు



పాలంగిలో ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

పల్లెలకు గోదావరి జలాలు

దేవరపల్లి: మండలంలోని గ్రామాలకు గోదావరి జలాలు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని ఎంపీపీ దుర్గారావు కోరారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన విజన్-2047 కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ గ్రామాల్లోని బోర్లలో సుద్ద నీరు వస్తోందన్నారు. గోదావరి నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటే ప్రజలు అన్ని విధాలా అభివృద్ధి చెందుతారన్నారు. తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఏఈ వెంకట్రావు, ఇతర శాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ

చాగల్లు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం 2047 నాటికి సాధించాల్సిన అభివృద్ధిపై ప్రణాళికయుతమైన కార్యాచరణను రూపొందించేందుకు యువకులు, మేధావులు తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చని ఎంపీడీవో ఆర్.శ్రీదేవి పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో స్వర్ణ ఆంధ్ర-2047కు సంబంధించి కార్యశాలను సోమవారం నిర్వహించారు. ఎంపీపీ ఎం.వీరాస్వామి, తహసీల్దార్ మెరికమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పుష్కరాల సమయానికి అన్ని గ్రామాలకు ఆర్టీసీ సేవలు



నూతన బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

చాగల్లు, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందిస్తామన్న హామీని త్వరలో నెరవేర్చనున్నట్లు కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోలో నూతన బస్సును ఆయన సోమవారం ప్రారంభించి మాట్లాడారు. పుష్కరాల సమయానికి అన్ని గ్రామాలకు ఆర్టీసీ సేవలు అందేలా కృషి చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకుని, సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి టి.వి.రామారావు, ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ సూరపనేని చిన్ని, నాయకులు దాయన రామకృష్ణ, పెనుమాక జయరాజు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో అన్నసమారాధన ప్రారంభం



భిక్ష స్వీకరిస్తున్న దీక్షాదారులు

దేవరపల్లి, న్యూస్‌టుడే: స్థానిక అయ్యప్ప స్వామి ఆలయంలో ఏటా మాదిగా దీక్షదారులకు అన్నదానం కార్యక్రమాన్ని సోమవారం నుంచి ప్రారంభించారు. గత 16 ఏళ్ల నుంచి ఇక్కడ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ గురుస్వాములు, కమిటీ సభ్యులు తెలిపారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అయ్యప్ప, భవానీ, శివ మాల ధరించిన దీక్షాదారులు ఉదయం వడి, మధ్యాహ్నం భిక్ష కోసం రోజూ సుమారు 300 మంది వస్తుంటారన్నారు. ఈ కార్యక్రమంలో కాకర్ల వెంకటేశ్వరరావు, పొన్నాడ వెంకట రమణరావు, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

భవానీ మాలధారులకు వసతి సదుపాయం



మాలధారులతో భక్తబృందం

నల్లజర్ల, న్యూస్‌టుడే: దూర ప్రాంతాల నుంచి నల్లజర్ల జాతీయ రహదారి మీదుగా విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి కాలినడకన వెళ్లే భవానీ మాలధారులకు వసతి సదుపాయం కల్పిస్తున్నట్లు నల్లజర్ల భక్తబృందం సభ్యులు సోమవారం తెలిపారు. ఇక్కడి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న పెట్రోలు బంక్ ఆవరణలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, విశ్రాంతి తీసుకోవడానికి వసతితోపాటు చరవాణులు ఛార్జింగ్ పెట్టుకోవడానికి ఏర్పాటు చేసినట్లు భక్తబృందం సభ్యులు ఆళ్ల రమేష్, వెదుళ్ల రామకృష్ణ, పాతూరి పాపారావు, సవలం రామకృష్ణ, కొత్తపల్లి నాగేశ్వరరావు, వల్లూరి వెంకటేశ్వరరావు తదితరులు తెలిపారు.

కార్యదర్శి, వీఆర్వోలకు సత్కారం

ఉండ్రాజవరం: తాడిపర్రులో బదిలీపై వెళ్లిన వీఆర్వో జె.లక్ష్మీనరసమ్మ, కార్యదర్శి పి.సత్యనారాయణలను సర్పంచి కరుటూరి నరేంద్రబాబు, సచివాలయం ఉద్యోగుల ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. కార్యదర్శిగా బదిలీపై వచ్చిన పి.ముసలయ్యకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

నాలుగు కిలోమీటర్లు.. ప్రయాణం నరకప్రాయం



దూబచర్ల నుంచి జి.కొత్తపల్లికి వెళ్లే రహదారిలో నాలుగు కిలోమీటర్ల మేర పూర్తిగా గుంతలు పడి అధ్వానంగా తయారైంది. గజానికో గుంతపడడంతో వాహనచోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తరచూ ప్రమాదాలబారిన పడుతున్నారు. కాలినడకన వెళ్లడానికి కూడా ఏ మాత్రం అనుకూలంగా లేదు. జంగారెడ్డిగూడెం సమీపంలోని గుర్వాయిగూడెంలో ఉన్న మద్ది ఆంజనేయ స్వామిని దర్శించుకోవడానికి ఈ మార్గంలోనే భక్తులు అధికంగా వెళుతుంటారు. గత వైకాపా ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఈ మార్గం గుండా ఆయా గ్రామాలకు పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభోత్సవాలకు రాకపోకలు సాగించినా రహదారిని నిర్మించలేకపోయారని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి కనీస మరమ్మతులైనా చేయించాలని కోరుతున్నారు. దీనిపై ర.భ. శాఖ డీఈ వెంకటరమణను వివరణ కోరగా దూబచర్ల నుంచి జి.కొత్తపల్లికి వెళ్లే నాలుగు కిలోమీటర్ల రహదారిలో గుంతలు పూడ్చడానికి రూ.40 లక్షలు నిధులు మంజూర్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. - న్యూస్‌టుడే, నల్లజర్ల

ప్రధాన రహదారే.. పట్టించుకున్న వారేరి..?



జీఎల్ఆర్ షాపింగ్‌మాల్ ఎదురుగా ఇలా..

ఇదేదో మారుమూల గ్రామాలకు వెళ్లే రోడ్డు కాదు. నిడదవోలు పట్టణంలోని ప్రధాన రహదారి. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించడంతోపాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి వివిధ పనుల నిమిత్తం వేలాది మంది వస్తుంటారు. పట్టణంలో ఏ దుకాణానికి వెళ్లాలన్నా ఇదే ప్రధాన మార్గం. ఇంత ప్రాధాన్యమున్న రోడ్డు పలు ప్రాంతాల్లో పెద్ద పెద్ద గుంతలుపడి ప్రమాదకరంగా మారింది. పొట్టి శ్రీరాములు విగ్రహం, జీఎల్ఆర్ షాపింగ్ మాల్ ఎదురుగా మరీ అధ్వానంగా ఉంది. ఓ మోస్తరు వర్షానికే నీరు నిలిచిపోయి రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రధాన రహదారికి కనీసం మరమ్మతులైనా చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నిడదవోలు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు తొమ్మిది అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో రాణి సుస్మిత

చాగల్లు, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: కొవ్వూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 9 అర్జీలు అందినట్లు ఆర్డీవో రాణిసుస్మిత తెలిపారు. తాళ్లపూడిలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన ఇంటిని తొలగించి డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని ఎం.సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. చాగల్లులోని మఠాం చెరువు వీధిలో దీపాలు వెలగడం లేదని, రోడ్లు సరిగాలేవని ఎన్.రాజ్‌కుమార్, తన భూసమస్య పరిష్కరించి స్థలాన్ని ఆన్‌లైన్ చేయాలని కోరుతూ నల్లజర్లకు చెందిన ఎన్.సత్యనారాయణ, ఎస్సీ ఏరియాలోని సామూహిక మరుగుదొడ్లను తొలగించాలని తాళ్లపూడి మండలం మలకపల్లికి చెందిన జి.సుబ్బారావు కోరారు. తనతో సహజీవనం చేసి మోసం చేసిన వ్యక్తిపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని, తనకు న్యాయం చేయాలని దొమ్మేరుకు చెందిన కె.విజయ ఫిర్యాదు చేశారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు దుర్వినియోగం చేస్తున్నారని, చర్యలు చేపట్టాలని తాళ్లపూడి మండలం మలకపల్లి గ్రామానికి చెందిన సిహెచ్.వెంకట్రావు అర్జీలను అందించారు. దేవరపల్లికి చెందిన పి.నాగరాజు గ్రామంలోని చెరువులో చేపల పెంపకానికి ప్రయత్నిస్తున్నారని, అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. దొమ్మేరు, నందమూరు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని దొమ్మేరు గ్రామానికి చెందిన కేవీకే.రంగారావు ఫిర్యాదు చేశారు. దరఖాస్తుదారుల అర్జీలను త్వరలో పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆర్డీవో రాణిసుస్మిత ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

చాగల్లు, న్యూస్‌టుడే: కూటమితోనే అభివృద్ధి సాధ్యమని నాయకులు పేర్కొన్నారు. మండలంలోని కుంకుడుమిల్లిలోని పంటపొలాలకు వెళ్లే మట్టి రోడ్డును చప్టు రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.25లు మంజూరు కావడంతో సోమవారం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు సుంకవల్లి రమేష్, కె.హరికృష్ణ, బి.శ్రీను, వై.ఉదయభాస్కర్ కృష్ణ, పాల్గొన్నారు.

సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయం



న్యూటన్‌పాండుకు సత్కరిస్తున్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, ఏపీఎస్పీఎఫ్ కమాండెంట్ కొండా నరసింహారావు తదితరులు

నిడదవోలు: పేదలపట్ల ప్రేమతో వ్యవహరిస్తూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న డాక్టర్ విప్పర్తి ఐజాక్ న్యూటన్‌పాండు అభినందనీయుడని ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ అన్నారు. తాడిమళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న న్యూటన్‌పాండును రాజమహేంద్రవరానికి చెందిన ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో కాకినాడలో డొక్కా సీతమ్మ స్ఫూర్తిదాయక అవార్డుతో సత్కరించారు. ఏపీఎస్పీఎఫ్ కమాండెంట్ డాక్టర్ కొండా నరసింహారావు, కిరణ్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకులు డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్, సైకాలజిస్ట్ డాక్టర్ నందిక మహాలక్ష్మికుమార్, డొక్కా భీమవెంకటసత్యకామేశ్వరరావు, బడే గోవిందరావు, రాయవరపు సత్యభామ డాక్టర్ మానికిరెడ్డి సత్యనారాయణ, ఫిలాంత్రోఫిక్ వ్యవస్థాపకుడు అద్దంకి రాజా పాల్గొన్నారు. ఆయనను విప్పర్తి స్వర్ణకుమారి, సింగులూరి రోజా, గీత, దివ్య, ప్రియదర్శిని, దైవకృప అభినందించారు.

సామాన్యులకు కూర'గాయాలు'

న్యూస్‌టుడే, చాగల్లు

కూరగాయల ధరలు రోజురోజుకు పెరుగుతూ చుక్కలను తాకుతున్నాయి. కార్తిక మాసంలో ధరల పెరుగుదల పరిపాటే అయినప్పటికీ దసరా సమయంలోనే ఈ పరిస్థితి ఎదురవడం పేద, మధ్య తరగతి ప్రజలకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. మాంసాహార ధరలు సైతం అధికంగానే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఏం కొనగలం...ఏం తినగలమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారానికి రూ. 500 చొప్పున వెచ్చిస్తున్నా ఓ చిన్న కుటుంబానికి సరిపడా కూరగాయలు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొవ్వూరు నియోజకవర్గం పరిధిలో దొమ్మేరు, కాపవరం, ధర్మవరం నుంచి తాళ్లపూడి మండలం వైపు కూరగాయల సాగు అధికంగా చేపడతారు. గడచిన ఐదేళ్ల కాలంలో ఎనిమిది సార్లు తుపాన్లు, వరదల ముంచెత్తడంతో కూరగాయల సాగులో తీవ్ర నష్టాలు వాటిల్లాయని, వాని ప్రభావం ధరలపై పడిందని పలువురు అంటున్నారు. దీనివల్ల వ్యాపారం కూడా అంతంత మాత్రంగానే ఉంటోందని కూరగాయల వ్యాపారులు వాపోతున్నారు. గతంలో కిలో కొనుగోలు చేసే వారు ఇప్పుడు అర, పావు కిలోతో సరిపెట్టుకుంటున్నారని అంటున్నారు. దీనివల్ల గతంలో రోజుకు రూ.4 వేల నుంచి రూ.5 వేల వ్యాపారం ప్రస్తుతం బాగా తగ్గిపోయిందని, కూరగాయలు అమ్ముడు కాకపోవడంతో ఏమి చేయాలో తెలియక ఇబ్బంది పడుతున్నామని వారంటున్నారు.



కొవ్వూరు రైతు మార్కెట్‌లో కూరగాయల విక్రయాలు

నియంత్రణ చర్యలు చేపట్టాలి..



గతంలో వంద రూపాయలతో సుమారు వారానికి సరిపడా కూరగాయలు కొనేవాళ్లం. ప్రస్తుతం వంటల్లో ముఖ్యమైన టమాటా ధర ఆకాశన్నంటుతోంది. వెల్లుల్లి కొనలేని పరిస్థితి. ధరల నియంత్రణకు ప్రభుత్వం కృషి చేయాలి.

– డి.నాగలక్ష్మి, గృహిణి, కొవ్వూరు

వ్యాపారం తిరిగి ప్రారంభించలేదు..

నేను కూరగాయల వ్యాపారం చేస్తుంటా. ఇటీవల వివాహ సమయంలో నిలిపివేయాల్సి వచ్చింది. మళ్లీ ప్రారంభించాలని ఉన్నా పెరిగిన ధరలతో నష్టాలు వచ్చే అవకాశం ఉంది. ఇప్పట్లో ధరలు తగ్గే అవకాశం కూడా కనిపించడం లేదు. అందుకే కూరగాయల వ్యాపారం తిరిగి ప్రారంభించాలన్న ఆలోచన ప్రస్తుతానికి వాయిదా వేసుకున్నా.

– వీరబాబు, ఆరికిరేవుల

కూరగాయల ధరలు (కిలో రూ.ల్లో)

రకం	వారం కిందట	ప్రస్తుతం
వెల్లుల్లి	200	400
ఉల్లిపాయలు	30	60
టమాటా	80	120
బీరకాయ	80	120
బెండకాయ	40	80
దొండకాయ	40	80
చిక్కుడు	80	120
క్యారెట్	40	80
బీన్స్	50	80
బీట్‌రూట్	40	60
క్యాబేజి	40	50
అల్లం	50	100